కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లుగా ఉంది వైసీపీ నాయకుల తీరు. ప్రభుత్వ స్థలాలు ఖాళీగా కనపడితే చాలు కబ్జాలకు సిద్ధమవుతున్నారు. రాత్రికి రాత్రే షెడ్లు వేసేస్తున్నారు వైసీపీ నాయకులు. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన స్థలాలను సైతం వదలడం లేదు. నకిలీ పట్టాలు సృష్టించి తామే అసలైన లబ్ధిదారులు అన్నట్లు నిర్మాణాలు చేపడుతున్నారు. ముఖ్యంగా నందవరం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో కబ్జాలు జోరుగా సాగుతున్నాయి. ఈ వ్యవహారం అంతా గత వైసీపీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో సాగింది. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.



నాగలదిన్నెలో స్థలాన్ని కబ్జా చేసి వైసీపీ నాయకుడు వేసిన రేకుల షెడ్డు

ఖాళీ జాగా.. వైసీపీ పాగా

- కబ్జా కోరల్లో ప్రభుత్వ స్థలాలు
- రాత్రికి రాత్రే షెడ్లు వేసి ఆక్రమణ
- పేదల స్థలాలను సైతం వదలని వైనం
- పట్టించుకోని అధికారులు
- లబోదిబోమంటున్న బాధితులు



నందవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నె గ్రామంలో వైసీపీ నేతల కబ్జాల్లో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేని పరిస్థితి. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలున్నాయి. ఎమ్మిగనూరు నుంచి గద్వాల అలాగే హైదరాబాద్‌కు వెళ్లే రహదారిలో నాగలదిన్నెలో సెంటు రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు ధర పలుకుతోంది. ఇదే అదునుగా భావించిన కొంత మంది వైసీపీ నాయకుల కన్ను ప్రభుత్వ స్థలాలపై పడింది.

1,955 మంది లబ్ధిదారులకు పట్టాలు..

2009లో వరదలు రావడంతో నాగలదిన్నెలోనే ఎమ్మిగనూరుకు వెళ్లే దారిలో ప్రభుత్వం 85 ఎకరాలు భూమిని కొనుగోలు చేసింది. 1,955 మంది లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేసింది. 1,686 మందికి నకలు పట్టాలు ఇచ్చారు. మిగిలిన 269 మందికి పట్టాలు ఇవ్వలేదు. అందులో ఆర్యవైశ్యులకు 84 మందికి పట్టాలు ఇచ్చారు. గ్రామానికి చెందిన అనూరాధ భర్త రమేష్‌శెట్టి పట్టా నెంబర్ 401, సుబ్బలక్ష్మీ భర్త రత్నయ్యశెట్టి పేరు మీద పట్టా నెంబర్ 402ను ప్రభుత్వం వారికి మంజూరు చేసింది. వారు గ్రామంలో లేకపోవడంతో వైసీపీ నాయకుడి కన్ను పడింది.

ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో..

ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో సర్వే నెంబర్ 401ను సరోజమ్మ, భర్త రంగారెడ్డి, సర్వే నెంబరు 402లో తెలుగు నరసమ్మ, భర్త వేమారెడ్డి పేర్లపై పట్టాలు పొందాడు. అక్రమ షెడ్లువేశారు. వాస్తవంగా ఆ కాలనీలో పట్టానంబరు 1,123 పేరు మీద సరోజమ్మ, 1,490లో తెలుగు నరసమ్మ పేరు మీద ప్రభుత్వం వారికి ముందే పట్టాలు మంజూరు చేసింది.

ఇదే అదనుగా కొందరు..

వైసీపీ నాయకుల అండదండలు చూసుకొని కొంత మంది నకిలీ పట్టాలు ఏర్పాటు చేసుకొని కబ్జాకు పాల్పడుతున్నారని బాధితులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిపి పట్టాలు చూపించాలని కోరుతున్నారు. మరో వైసీపీ నాయకుడికి గతంలోనే ఏకంగా శ్మశానంపైనే కన్ను పడింది. కానీ ప్రస్తుతం ఆ స్థలంలో అధికారులు బోర్డు పెట్టారు. మరో నాయకుడు సర్వేనెంబరు 59లో బస్టాండ్ ఎదురుగానే మెయిన్ రోడ్డు పక్కనే లబ్ధిదారులకు ఇచ్చిన ప్లాట్లు, వాటర్ ట్యాంక్ కోసం కేటాయించిన స్థలాన్ని సైతం కబ్జా చేశాడు. అందులో కూడా షెడ్లు వేశాడు. బాధిత కుటుంబాలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేసినా అప్పటి అధికార పార్టీ ప్రజాప్రతినిధితో అధికారులపై ఒత్తిడి తెచ్చి అడ్డుకట్ట వేయించారు. దీంతో ఆ నాయకుడు నిర్మాణాలు చేపట్టాడు.



నాగలదిన్నెలో మరో వైసీపీ నాయకుడు రోడ్డు పక్కన కబ్జా చేసి ఏర్పాటు చేసుకుంటున్న షెడ్డు

పంచాయతీ తీర్మానాల కోసం..

కబ్జా చేసిన వైసీపీ నాయకులు ఇంత వరకు పంచాయతీ తీర్మానం లేకపోవడంతో తంటాలు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి తీర్మానం రాయనని, సర్పంచ్, వార్డు సభ్యులతో మాట్లాడి తీర్మానం చేసుకోవాలని తెలపడంతో కబ్జాదారులు తలలు పట్టుకుంటున్నారు. పార్టీ మారిందని ఎలాగైనా తీర్మానం చేయించకపోతే తమ అక్రమంగా కట్టుకున్న షెడ్లు తొలగించే పరిస్థితి నెలకొంటుందని వారితో బేరసారాలు ఆడుతున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యే ఆదేశించినా..

నాగలదిన్నెలో కబ్జాకు గురైన స్థలాలను రికవరీ చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అయినా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

లబ్ధిదారులకు న్యాయం చేస్తా



నేను కొత్తగా వచ్చాను. మా సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరిస్తా. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు లబ్ధిదారులకు వచ్చేలా న్యాయం చేస్తా.

- శ్రీనివాసులు, తహసీల్దార్

భక్త కనకదాసు సమతావాది

- మనుషులంతా ఒకటేనని చాటిన వ్యక్తి
- జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్
- భక్త కనకదాసుకు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు మంచి గాయకుడు, సమతావాది అని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో డీబీసీ డబ్ల్యూవో ప్రసూన అధ్యక్షతన భక్త కనకదాసు జయంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మనుషుల్లో వివిధ కులాలు ఉన్నప్పటికీ.. మనుషులంతా ఒక్కటేనని చాటిన వ్యక్తి భక్త కనకదాసు అని అన్నారు. తన కీర్తనల ద్వారా భక్తి, సామాజికతత్వాన్ని బోధించిన గొప్ప తత్వవేత్త అని పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ సాధికారత ప్రసూన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం భక్త కనకదాసు జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుసేన్, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ వీబీవీ సుబ్బయ్య, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్లు మల్లికార్జున, భాస్కర్, కురువ సంఘం డైరెక్టర్లు శ్రీనివాసులు, గొల్ల సంఘం చైర్మన్ శ్రీనివాసులు, గొర్ల సొసైటీ డైరెక్టర్ మద్దిలేటి, కురువ సంఘం డైరెక్టర్ వెంకట్రాముడు, జిల్లాకురువ సంఘం అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, మహిళా అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, కురువ సంఘం నాయకులు పెద్దపాడు ధనుంజయుడు పాల్గొన్నారు.

- స్థానిక బీసీ భవనం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన భక్త కనకదాసు విగ్రహానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, కురువ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.
- సునయన ఆడిటోరియంలో జరిగిన కనకదాసు జయంతోత్సవాల్లో ఏఒక్క ప్రజా ప్రతినిధి హాజరు కాకపోవడం బాధాకరమని కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి రంగస్వామి, కోశాధికారి కేసీ నాగన్న, నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, బి.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఏ.సిరి తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారీ అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి సీఎం కృషి

- వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరు
- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పని చేస్తున్నారని 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై తప్పుడు కూతలు కూస్తే వైసీపీ నాయకులను ప్రజలే తరిమి కొడతారని హెచ్చరించారు. తప్పుడు కూతలు ఇకనైనా మానుకోవాలన్నారు. రూ.44 వేల కోట్ల ప్రజల సొమ్మును దోచుకున్న వ్యక్తి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సూపర్ సిక్స్ పథకాల హామీలను అమలు చేయడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని, ఎలాగైనా కూటమి ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారని ఆరోపించారు. తుఫాన్ సహాయ కార్యక్రమాలపై హేళన చేయడం దారుణమన్నారు. చంద్రబాబు అరచేయి అడ్డుపెట్టి ఆపాడని చంద్రబాబును విమర్శించడమా.. క్రికెట్ క్రీడాకారులను మంత్రి నారా లోకేశ్ అభినందించడంపై తప్పుడు కూతలు కూయడం ఏమిటని మండిపడ్డారు. వైసీపీ నాయకులు రాంబాబు, పేర్నినాని, అలాగే రాజకీయం తెలియని వెంకటరెడ్డి కూడా చంద్రబాబు, లోకేశ్ గురించి మాట్లాడుతున్నారని, విమర్శించే అర్హత వారికి లేదని అన్నారు.

అన్నదాతలకు కడుపార భోజనం

- 2016 నుంచి 'రూ.15కే భోజనం' అమలు
- ఇస్కాన్ సహకారంతో నిర్వహిస్తున్న మార్కెట్ కమిటీ

7

హొళగుందలో ట్రైనీ ఐఏఎస్‌లు

హొళగుంద, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్(ఏబీపీ) క్రింద సెలెక్ట్ అయిన హొళగుంద మండలాన్ని శనివారం ట్రైనీ ఐఏఎస్‌లు సందర్శించారు. యూపీ క్యాడర్‌కు చెందిన ఆల్ఫ్రెడ్, శివసింగ్, మైఖేల్, నిధియా, శివణేందరణ్, కేకే శివాణి హొళగుందకు వచ్చినట్లు ఎంపీడీవో విజయలలిత తెలిపారు. వీరు మండలంలోని జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, విద్యా, వైద్యం, వ్యవసాయంతో పాటు పలు అంశాలపై నాలుగు రోజులు అధ్యయనం చేయనున్నారు. కార్యక్రమంలో ఏబీపీ కోర్డినేటర్ శివ శంకర్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.



హొళగుందకు వచ్చిన ట్రైనీ ఐఏఎస్‌లు

లాంచీ ప్రయాణం.. ఆహ్లాదకరం

- 66 మందితో వచ్చిన టీఎస్ టూరిజం లాంచీ
- సోమశిల నుంచి శ్రీశైలానికి 120 కిలోమీటర్ల



శ్రీశైలం చేరుకున్న డబుల్ డెక్కర్ లాంచీ

శ్రీశైలం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : శ్రీశైల మల్లన్నను దర్శించు కునేందుకు కృష్ణానదిపై లాంచీ ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని యాత్రికులు హర్షం వ్యక్తంచేశారు. శనివారం ఉదయం 11గంటలకు సోమశిల నుంచి శ్రీశైలం బయలుదేరిన తెలంగాణ టూరిజం డబుల్ డెక్కర్ లాంచి సాయంత్రం 6గంటలకు పాతాళగంగ వద్దకు సురక్షితంగా చేరుకుంది. కృష్ణానదిపై ఏడాది తరువాత పర్యాటకులకు అందుబాటులోకి వచ్చిన లాంచీ ప్రయాణం ప్రకృతి అందాలు, పచ్చదనం, వివిధ రకాల పక్షుల శబ్దాలు, చెంచు గూడెంలను చూస్తూ శ్రీశైలానికి చేరుకున్నట్లు ప్రయాణికులు తెలిపారు. 120 మంది సామర్థ్యం గల లాంచీలో 66 మందితో వచ్చారు. ఆదివారం ఉదయం సోమశిలకు తిరుగు ప్రయాణం అవుతామని టూరిజం అధికారులు తెలిపారు. సోమశిల నుంచి శ్రీశైలం వరకు జలమార్గం సుమారు 120 కిలోమీటర్లు ఉంటుంది.

కర్నూలు నుంచి వైజాగ్‌కు ప్రత్యేక బస్సులు

ప్రారంభించిన మంత్రి టీజీ భరత్



బస్సును ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ కర్నూలు నుంచి వైజాగ్‌కు మూడు ఏసీ బస్సులను ఏర్పాటు చేయగా శనివారం నగరంలోని ఆర్టీసీ కొత్తబస్టాండ్‌లో పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి వైజాగ్‌కు వెళ్లే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఏసీ సర్వీసులు అందుబాటులోకి తీసుకవచ్చామని వివరించారు. దీనివల్ల రెండు ప్రాంతాలకు అనుసంధానం పెరుగడమే కాకుండా టూరిజం పరంగా మరింత అభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు. వైజాగ్‌కు బస్సు సర్వీసు కావాలని తెలిసిన వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చి ప్రయాణికుల కోరిక మేరకు మూడు నూతన బస్సులను ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన తనకు ఎంతో బాధ కలిగించిందని అన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో ఆటోమేటిక్ స్ప్రింక్లర్ సిస్టమ్ బస్సులో ఉంటే ప్రాణపాయం జరగకుండా ఉంటుందన్నారు. ఈవిషయంపై ప్రధాని మోదీకి లేఖ రాసినట్లు చెప్పారు. త్వరలోనే ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఆటోమెటిక్ స్ప్రింక్లర్ సిస్టమ్‌పై చర్చిస్తామని మంత్రి చెప్పారు. కర్నూలు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు, డిపో మేనేజర్లు సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంతో భక్తుల సందడి

మంత్రాలయం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళ నాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు భక్తులు ఆశీస్సులు అందించారు.



మూగజీవాలకు మేతగా వదిలిన ఉల్లి పంట

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి

- ధర తగ్గిపోవడంతో ఆందోళనలో రైతులు
- పంటను పొలంలోనే వదిలేస్తున్న అన్నదాతలు

గోనెగండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా ఉల్లి ధర తగ్గుముఖం పట్టింది. దీంతో సాగు చేసిన రైతులు లబోదిబోమంటున్నారు. కర్నూలు మార్కెట్‌లో క్వింటం ధర రూ. 500 నుంచి రూ. 800 లోపే ధర పలుకుతోంది. అయితే సరాసరి మీద ఉల్లి పంట క్వింటం రూ. 600 మించి మార్కెట్ లో ధర పలకడం లేదని రైతులు చెబుతున్నారు. మార్కెట్ కు పోతే కనీస ధర కూడా పలకక పోవడంతో పాటు రవాణా ఖర్చులకు కూడా రావని తలచి ఇక చేసేదేమీలేక రైతులు పొలాల దగ్గరనే వ్యాపారులకు క్వింటం ధర రూ. 500 నుంచి రూ. 600 లోపే విక్రయిస్తున్నారు. మరి కొంత మంది రైతులు ఆటోలలో ఉల్లి బస్తాలను వేసుకొని గ్రామాలలోని వీదుల్లో తిరుగుతూ రూ. 100 కు ఆరు కేజీల ప్రకారం విక్రయిస్తున్నారు. 50 కేజీల బస్తా రూ. 500 నుంచి 600 అమ్ముతున్నారు. ఈ ఏడాది దిగుబడి కూడా సగంకు పడిపోయింది ఎకరంలో 300 బస్తాలు దిగుబడి రావాల్సి ఉండగా 200 బస్తాలకు మించి దిగుబడి రాలేద ని రైతులు చెబుతున్నారు. కష్టపడి పండించిన పంటను వీదుల్లో తిరుగుతూ కేజి ప్రకారం అమ్మలు జరుపుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు పెట్టుబడి దాదాపు రూ.80వేల నుంచి రూ. 90వేల వరకు వస్తోందని అన్నదాతలు చెబుతున్నారు.

రెండు ఎకరాల పంటను వదిలేశాను

రెండు ఎకరాలను కౌలుకు తీసుకొని రూ. 2లక్షలు పెట్టుబడి పెట్టి ఉల్లిపంటను సాగు చేశాను. అయితే ఈ ఏడాది వాతవరణం మార్పు, అకాలవర్షాల కారణంగా పంట దిగుబడి కూడా తగ్గిపోవడం, మార్కెట్ లో గిట్టుబాటు ధర లభించక పోవడందో పంటను కోస్తే కూలీలకు కూడా గిట్టుబాటు కాదు కావున చేసేంది లేక శనివారం రెండు ఎకరాలలో పండిన ఉల్లి పంటను మూగ జీవాలకు గ్రాసం గా వదిలాను.

- రంగముని, రైతు, గోనెగండ్ల

తుంగభద్ర తీరం

సాహిత్యం

మానవీయ విలువల కవన పతాకం మంచికోసం



కర్నూలు కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'హితేన సహితం సాహిత్యం' అని శాస్త్రోక్తి. కవి అంటే కష్టజీవికి ఇరువైపులా ఉండి అండగా నిలిచేవాడు అని ఆధునిక నిర్వచనం. కవి తన భావజాలంతో అందమైన పంక్తులుగానే కాదు, అవసరమైతే మూఢ విశ్వాసాలను, అనాచారాలను చీల్చే గండ్రగొడ్డలిలా కూడా కలాన్ని వాడగలడు. సున్నితమైన మానవీయ విలువలను హృదయంలో నాటుకునేలా ప్రకటించగలడు. ఆ ప్రయత్నంలో 'మంచికోసం' కవితా సంపుటి రచయిత డాక్టర్ అనుగోలు సంజీవరాయుడు విజయం సాధించారని ఈ పుస్తకం చదివితే అవగతం అవుతుంది. వృత్తిరీత్యా రచయిత జడ్పీ ఉన్నత పాఠశాల, గోసానిపల్లె, డోన్ మండలం, నంద్యాల జిల్లాలో తెలుగు భాషోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. తెలుగుభాష పట్ల ఎంతో మక్కువ ఉన్న ఆయన 'సూర్య చంద్ర పదాలు' ద్వారా తొలిసారిగా తన సృజనాత్మకతను అక్షర రూపంలో ప్రకటించారు. మేడిపండులాంటి సమాజంలోని లోపాలను ఎత్తిచూపుతూ, వాటికి పరిష్కార మార్గాలు చూపుతూ సంధించిన కవితా శరమే 'మంచికోసం'.

'నా కవితలు ఊహా జనితాలు కాదు/కాలక్షేపానికి అసలే కాదు/ఒకరి మెప్పుకోలుకు కాదు/నిజాలు, నిజాలు, నగ్నసత్యాలు/ నా కవిత అభ్యుదయ కవిత' అంటూ సమకాలీన వర్తమాన సమాజ స్థితి గతులను విప్పి చెప్పాడు. ప్రకృతిని, సమాజాన్ని, సంస్కృతిని, ఆచారాలను, మూఢాచారాలను, ఆర్థిక అసమానతలను, యుద్ధాలను, శాంతిని, ఐక్యతను, సామరస్యాన్ని, సమహజీవనాన్ని, స్వేచ్ఛను, తెలుగు భాషను, తెలుగు గడ్డను ఇలా ఒకటేమిటి విభిన్న అంశాలతో 84 వచన కవితలతో కూర్చిన కవితా సంపుటి 'మంచికోసం'.

రచయిత డాక్టర్ అనుగోలు సంజీవరాయుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి బాటలో సౌందర్య ప్రియత్వాన్ని, సుకుమార భావతత్వాన్ని, సుందర అభివ్యక్తీకరణను తన సొంతం చేసుకొని, కవన సౌరభాలను ఈ కవితల్లో వ్యక్తీకరించారు. అందుకే ప్రకృతిలోని సంపదలైన పక్షులు, సెలయేళ్లు, తూనీగలు, లేళ్లు, ఉరుములు, మెరుపులు, ఇంద్ర ధనస్సులు, చందమామ చిరునవ్వులు కవిత్వంగా కనిపిస్తాయి. అలాగే శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వ ఛాయలు కూడా గోచరమవుతాయి. మానవ సమాజం దాని పురోగ, తిరోగమనాలు, ఆర్థిక స్వావలంబన, పేదరికం, మానవత్వం, మంచితనం, సమాజంలోని అసమానతలు అనేక చోట్ల స్పర్శిస్తాయి. సామాజిక విలువలు తగ్గిపోతున్న ఈ ఆధునిక కాలంలో నైతికంగా మనిషిని తిరిగి పునర్జీవితుడ్ని చేయడానికి కలాన్ని ఆయన ఆయుధంగా వాడుకున్నారు. అలాగే ఉగ్రవాదం ప్రపంచాన్ని ఎంతగా అతలాకుతలం చేస్తుందో, దాన్ని ఎలా సమూలంగా నిర్మూలించాల్లో తెలియజేశారు. 'కాయానికి గాయమైతే నయం చేసుకుంటాం/పంటకు పురుగుపడితే కీటక నాశిని చల్లుకుంటాం/ఇంటికి బూజు పడితే దులుపేసుకుంటాం/అందుకే ప్రపంచమా మేలుకో/ప్రగతి విపంచికను సవరించుకో/చీకటిని ప్రేమించే ఉగ్రవాద సంస్థలని/కూకటివేళ్లతో పెకిలించాలి/ప్రతి పౌరుడు ఒక సైనికుడై/ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలి' అంటారు.

రాయలసీమవాసిగా రచయితకు తాను రాస్తున్న కవిత్వంపై సుస్పష్టమైన లక్ష్యం ఉంది. అందుకే ఆయన 'నేను అభ్యుదయ కవిని/విప్లవవిని/కార్మికుల కష్టం నా కవిత్వం/సమాజ సంఘటనలు నా కవిత్వం/ అధర్మ, అక్రమాలను చీల్చి చెండాడేది నా కవిత్వం' అంటారు. తెలుగు భాషోపాధ్యాయునిగా తెలుగు భాషకు సేవలు అందిస్తూనే ఇటు సమాజంపట్ల ఒక పౌరునిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ తన రచనల ద్వారా మేల్కొలుపు పాటలు పాడుతున్నాడు. భవిష్యత్తులో డాక్టర్ సంజీవరాయుడు మరిన్ని సమాజ శ్రేయోదాయక రచనలు రాయాలని అభిలషిస్తున్నాను.



- డాక్టర్ తొగట సురేశ్ బాబు, ప్రధానోపాధ్యాయులు, సాహితీవేత్త, కర్నూలు జిల్లా

నృత్య సంగీతాల్లో తల్లీబిడ్డ

- ప్రతిభా పురస్కారాలు.. ప్రశంసల వెల్లువ
- ఇద్దరితో మొదలై 130 మందికి శిక్షణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆ తల్లీ కూతుళ్లిద్దరూ సంగీత నాట్యాల్లో కీర్తి గడించారు. అనేక అవార్డులు అందుకున్నారు. తల్లి నాగమల్లేశ్వరి, కూతురు దేవిశ్రీ కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్య శిక్షకులుగా కూడా ప్రశంసలు అందుకుంటున్నారు. ఎప్పుడో సరదాగా నేర్చుకున్న కళ ఇప్పుడు వృత్తిగా మారింది. నాగమల్లేశ్వరి పదో తరగతి పూర్తవగానే వివాహం, ఆపై పిల్లలు. తరువాత ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. పిల్లల చదువు కోసం కోసం ప్రతిరోజు ఈ.తాండ్రపాడు పుట్టి మీద కర్నూలుకు వచ్చిపోయేవారు. పిల్లల కోసం సాయంత్రం అక్కడే ఉండేవారు. ఇది చూసిన ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ అవకాశం ఇచ్చింది. అక్కడ విధులు అయ్యాక పిల్లల కోసం సాయంత్రం వరకు ఫ్రీగా ఉండకుండా సంగీతం నేర్చుకున్నారు. ఆ తరువాత సంగీత శిక్షకురాలుగా స్థిరపడ్డారు. తల్లిబాటలోనే కుమార్తె దేవీశ్రీ కూచిపూడి నృత్యం నేర్చుకొని, శిక్షకురాలుగా మారారు. వీరు నగరంలోని ఎన్ఆర్ పేటలో నివాసముంటున్నారు.





చిన్నారులకు సంగీతం నేర్పిస్తున్న నాగమల్లేశ్వరి

నాగమలేశ్వరి పుట్టినిల్లు కర్నూలు మండలం ఈ.తాండ్రపాడు, అత్తవారిది నందికొట్కూరు మండలం వడ్డేమాను గ్రామం. భర్త రామలింగం ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. సరదాగా కర్ణాటక సంగీతం నేర్చుకున్న నాగమల్లేశ్వరి కాలనీలో ఉండే పిల్లలకు సంగీతం నేర్పిస్తూ గుర్తింపు తెచ్చుకుని దాన్నే వృత్తిగా మలుచుకున్నారు. ఇదే స్ఫూర్తితో కూతురు దేవీశ్రీ ఫిజియోథెరపీ కోర్సు చేస్తూనే కూచిపూడి నాట్యంలో డిప్లమో పూర్తి చేశారు. తల్లీ కూతుళ్లు కలిసి శ్రీవెంకటేశ్వర సంగీత నృత్య నిలయాన్ని ప్రారంభించి శిక్షణ ఇస్తున్నారు. కర్నూలు నగరానికి చెరందిన పలువురు విదేశాల్లో స్థిరపడ్డారు. గతంలో వారి పిల్లలు ఇక్కడ శిక్షణ తీసుకున్నారు. సంగీతం, నృత్యంపై పట్టు తప్పకుండా అక్కడికి వెళ్లినా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఐదేళ్లుగా ఆస్ట్రేలియా, కెనడా, క్యాలిఫోర్నియా, అమెరికా, దుబాయ్, అబుదాబిలో ఉన్న భారత సంతతికి ఆన్‌లైన్‌లో సంగీతం తరగతులు నిర్వహిస్తున్నారు. దేశంలోని సూరత్, గుజరాత్, విజయవాడ, మహబూబ్‌నగర్, వరంగల్, హైదరాబాదు, నాయుడు పేటలో పలువురికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నారు. విదేశాల్లో సుమారు 11 మంది ఉండగా, స్వదేశంలో 30 మందికి సంగీతం, నృత్యంలో తల్లికూతుళ్లు శిక్షణ ఇవ్వడం గమనార్హం. ఎన్ఆర్‌పేటలోని శిక్షణాలయంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కర్ణాటక సంగీతం, కూచిపూడి నాట్యంలో శిక్షణ ఇస్తున్నారు. బ్యాచ్‌ల వారిగా సుమారు వంద మంది పిల్లలు శిక్షణ పొందుతున్నారు. పగటి పూట కొందరు గృహిణులు సైతం సంగీతం నేర్చుకోవడానికి వస్తున్నారు. ఇందులో వీఐపీ కుటుంబాలకు చెందిన పలువురు మహిళలు, వైద్యులు ఉన్నారు.

నాగమల్లేశ్వరి అందుకున్న పురస్కారాలు..

- 2022లో మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయంలో మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ చేతుల మీదుగా సన్మానం.
- హైందవ శ్రేష్టి ఆధ్వర్యంలో ధార్మిక విద్యాసేవక్ టీజీ కళాక్షేత్రంలో నిర్వహించిన భగవద్గీత పారాయణానికి సంబంధించి జిల్లా నుంచి ఎంపిక.
- ఇదే సంవత్సరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టీజీ కళాక్షేత్రంలో నాగశక్తి అవార్డును సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి చేతుల మీదుగా అందుకున్నారు.
- 155 మంది పిల్లలతో భగవద్గీత ఒకటో అధ్యాయాన్ని సామూహికంగా సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో పారాయణం చేయించినందుకు ఇస్కాన్ రఘునందన్ ప్రభు చేతుల మీదుగా వండర్ బుక్ ఆఫ్ అవార్డును 2024లో అందుకున్నారు.

ఇద్దరితో మొదలై...

ప్రారంభంలో ఇద్దరితో మొదలైన సంగీత, నృత్య శిక్షణ ప్రస్తుతం 130 మందికి చేరుకుంది. నాగమల్లేశ్వరి తన గురువు ధనలక్ష్మి ప్రేరణతో సంగీతం నేర్పిస్తున్నారు. మొదట్లో పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ల కుమార్తెలు వచ్చేవారు. నాగమల్లేశ్వరి శిక్షణ తీరును ప్రశంసించడంతో అక్కడి నుంచి వరద మాదిరి పిల్లలు సంగీతం నేర్చుకోవడానికి వచ్చేవారు. సంగీతంతో పాటు కూచిపూడి కూడ దేవీశ్రీ వద్ద నేర్చుకుంటున్నారు.



చిన్నారులకు నృత్యం నేర్పిస్తూ..

దేవీశ్రీ ప్రదర్శనలు.. అందుకున్న పురస్కారాలు

- సెట్కూరు వారు నిర్వహించిన జిల్లా స్థాయిలో యూత్ ఫెస్టివల్ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో 2015, 2017 సంవత్సరాల్లో రెండుసార్లు జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. రెండుసార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు అందుకున్నారు. కర్నూలు నగరంలోని శారదా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో వేసవి శిబిరంలో ఉత్తమ ప్రదర్శన ఇచ్చి అప్పటి రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.
- జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో పలు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.
- ఇండియా టుడే వారు వైజాగ్‌లో 2018లో నిర్వహించిన ఇండియా టుడే సౌత్ కాంక్లేవ్-2018లో ఇచ్చిన ఉత్తమ నృత్య ప్రదర్శనను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూసి అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు.
- 2017లో హర్యానాలో స్టేట్ జూబ్లీ సందర్భంగా కురుక్షేత్రంలో కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. దేవీశ్రీ ప్రతిభను మెచ్చుకున్న అప్పటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు.
- 2018లో హైదరాబాద్‌లోని తెలుగు వర్సిటీలో దక్షిణాది నృత్య ఉత్సవాల సందర్భంగా ప్రదర్శన ఇచ్చారు. ప్రతిభను గుర్తించిన ప్రతినిధులు నాట్య విద్యాధరణి పురస్కారాన్ని అందజేశారు.
- 2019 జనవరిలో డిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన గణతంత్ర వేడుకల్లో ఇతర రాష్ట్రాల నృత్య కళాకారిణులతో కలిసి పాల్గొని ప్రదర్శన ఇచ్చారు.
- గ్రేటర్ నోయిడాలో ఏపీ టూరిజం తరఫున అనేక ప్రదర్శనలు ఇచ్చి అభినందనలు అందుకున్నారు.
- శ్రీశైలం, కాణిపాకం, కాళహస్తి, తిరుచానూర్, వేలూరు గోల్డెన్ టెంపుల్, జోగులాంబ అలంపూర్, అహోబిలం, మంత్రాలయం, నందవరం చౌడేశ్వరి ఆలయాల్లో నిర్వహించిన బ్రహ్మోత్సవాలు, వార్షికోత్సవాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చి గుర్తింపు పొందారు.
- దసరా వినాయక చవితి నవరాత్రులు, నిమజ్జనోత్సవ కార్యక్రమాల్లో నృత్యం చేసి అతిథులచే అభినందనలు అందుకున్నారు.
- ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉగాది, సంక్రాంతి సంబరాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచి ప్రముఖులచే ప్రశంసలు అందుకుంటున్నారు.
- ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న జాతీయ సాంస్కృతిక సమ్మేళనంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ మెప్పిస్తున్నారు.

మరింత మందికి నేర్పించాలన్నదే నా కల..

సంగీతంలో మరింత మందికి శిక్షణ ఇవ్వడమే నా లక్ష్యం. సరదాగా, ఆసక్తిగా నేర్చుకున్న సంగీతమే నాకు వృత్తిగా మారింది. సంగీతం గురువులు జ్యోతిర్మయి, సరస్వతి, నారాయణస్వామి, శ్రీనివాస్‌ల ఆశీస్సులతో నేను సంగీత ఉపాధ్యాయినిగా రాణిస్తున్నాను.

- నాగమల్లేశ్వరి, కర్ణాటక సంగీత శిక్షకురాలు



తమిళనాడులోని గోల్డెన్ టెంపుల్‌లో తల్లి, కూతరు నాగమల్లేశ్వరి, దేవీశ్రీ

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఉంది

నేను ఆరో తరగతి చదువుతున్నప్పుడే కూచిపూడి శిక్షణ తీసుకున్నా. గురువులు నారాయణస్వామి, నాగసాయి ప్రదీప్ శిక్షణలో మెళకువలు నేర్చుకున్నాను. అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చి గుర్తింపు పొందాలన్నదే నా లక్ష్యం.

- దేవీశ్రీ, కూచిపూడి నృత్యకారిణి

ఎన్ఎంయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

కోవెలకుంట్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిర ఫంక్షన్‌హాలులో సుదర్శన్‌రావు అధ్యక్షతన జిల్లా ద్వితీయ మహాసభ ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నంద్యాల జిల్లా అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు పి.సత్యనారాయణ రావు, సి.మద్ది లేటి, రాష్ట్ర కార్యదర్శి భద్రావతి, జోనల్ అధ్యక్షులు వినోద్‌బాబు హాజరయ్యారు. ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడిగా డి.శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్‌గా సుదర్శన్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంటుగా వీపీరెడ్డి, జిల్లా కార్యదర్శిగా శివరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా సిబ్బందికి ప్రమోషన్ ఇవ్వకపోవడం వల్ల చాలా మంది ఆర్థికంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం ప్రతిష్మాకంగా ప్రవేశ పెట్టిన స్త్రీశక్తి పథంలో భాగంగా సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేయడం వల్ల సంస్థకు మంచి పేరు వచ్చినప్పటికీ బస్సుల కొరత, సిబ్బంది కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వాటిని వెంటనే యాజమాన్యం పరిష్కరించాలని కోరారు.

చేపల అక్రమ వేటను అరికడతాం

- మత్స్య శాఖ జిల్లా అధికారి రంగనాథబాబు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పందికోన రిజర్వాయరులో చేపల అక్రమ వేటను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామని మత్స్య శాఖ జిల్లా అధికారి రంగనాథబాబు అన్నారు. శనివారం మత్స్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమంగా చేపల వేట కొనసాగిస్తున్న వారిని తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పందికోన రిజర్వాయరు పరిధిలో మత్స్యకారుల సహకార సంఘాలు లేవని, అందువల్ల ఏటా మత్స్యశాఖ బహిరంగ వేలం ద్వారా చేపల పెంపకానికి అనుమతులు ఇస్తుం దన్నారు. జూన్-2025తో చేపల వేటకు గడువు పూర్తయిందన్నారు. రాష్ట్రంలోని మైనర్ ఇరిగేషన్ చెరువులు, రిజర్వాయర్లలో చేపల వేటకు మత్స్య సహకార సంఘాలకు అనుమతులను ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదని, అందువల్ల ఈ సంవత్సరం వేలం పాట ఇప్పటిదాకా నిర్వహించలేదని వివరించారు. రూ.50లక్షల వరకు అక్రమార్కులు చేపల వేట కొనసాగించి దోపిడీ చేశారని కొందరు ప్రచారం చేస్తున్నారని, ఇందులో వాస్తవం లేదన్నారు. ప్రభుత్వం జీవో జారీ చేసేవరకు చేపలు పట్టకుండా నివారిం చేందుకు అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. ఎవరైన అక్రమంగా చేపల వేట కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రకృతి మన జీవితానికి మూలం

- మొక్కలు నాటే బాధ్యతను తీసుకోవాలి
- కలెక్టర్ రాజకుమారి
- ఆకట్టుకున్న సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు

డోన్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి మన జీవితానికి మూలమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం మండలంలోని ఎర్రగుంట్ల గ్రామ సమీపంలో ఉన్న నగరవనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధానోత్సవాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటే బాధ్యత ప్రతి కుటుం బం తీసుకోవాలన్నారు. నగరవనంలోని ఉసిరి చెట్టుకు కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. ప్రజలందరూ భక్తి భావంతో కార్తికవన సమారాధనోత్సవాలను జరుపుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పర్యావరణ సంకల్పాలను ప్రతిబింబించే చిన్నారుల పాటలు, నృత్యాలు అలరించాయి. విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఉసిరి మొక్కలు పంపిణీ చేశారు. నగరవనంలో కార్తీక సమారాధ నోత్సవాలు డోన్ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో రామునాయక్, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు నరసింహులు, శివనా గజ్యోతి, డీఎఫ్‌వో నాగమునేశ్వరి, డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

డోన్ మండలం ఎర్రగుంట్ల గ్రామం వద్ద నగరవనంలో శనివారం జరిగిన కార్తీక వన సమారాధన ఉత్సవాల్లో అధికారులు, ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. జిల్లా అటవీశాఖ అధికారి నాగమనేశ్వరి, డోన్ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనోత్సవాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు ఓ సినిమా పాటకు స్టెప్పులు వేసి అలరించారు. అలాగే టగ్ ఆఫ్ వార్‌లో కలెక్టర్ రాజకుమారి పాల్గొన్నారు. అధికారులు ఉత్సాహంగా, ఉల్లాసంగా నవర వన కార్తీక వన సమారాధోత్సవాల్లో కనిపించారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పందెం

పెద్దకడబూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు జయంతి సందర్భంగా శనివారం పెద్దకడబూరులో పొట్టేళ్ల పందెం నిర్వహించారు. 18 పొట్టేళ్లు పాల్గొన్నాయి. ఎర్ర రంగు పొట్టేళ్ల విభాగంలో ఏటిగడ్డ పులి మొదటి స్థానంలో నిలవగా టీడీపీ నాయకుడు విరుపాక్షి రూ.15 వేలు ఇచ్చారు. నల్లరంగు పొట్టేళ్ల విభాగంలో భీమకు చెందిన పొట్టేలు మొదటి స్థానంలో నిలవడంతో టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఇచ్చిన రూ.20 వేలు ఆయన సోదరుడు రామకృష్ణారెడ్డి అందజేశారు. ఎర్రరంగు పొటేళ్ల విభాగంలో ఓబన్నకు చెందిన పొట్టేలు రెండు స్థానంలో, నల్లరంగు పొటేళ్ల విభాగంలో బల్లా పొటేలు రెండో స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో నిలిచిన పొట్టేళ్లకు మల్లికార్జున, శివన్న రూ.10 వేలు చొప్పున ఇచ్చారు. ఈ బహుమతులను అతిథులు ప్రదానం చేశారు.



పెద్దకడబూరులో పోటీ పడుతున్న పొట్టేళ్లు

అందుబాటులో ఆధునిక వైద్యం

- ప్రముఖ యూరాలజిస్టు డాక్టర్ విక్రమసింహారెడ్డి
- నంద్యాలలో ప్రారంభమైన యూరాలజీ వైద్యుల సదస్సు
- ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన 300 మంది వైద్యులు



డాక్టర్ విక్రమసింహారెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు

నంద్యాల హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో ఆధునిక వైద్యం అందుబాటులో ఉందని ఉస్మానియా ఆస్పత్రి రిటైర్డు సూపరింటెండెంట్, ప్రముఖ యూరాలజిస్టు డాక్టర్ విక్రమసింహారెడ్డి చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాల రెండు రోజుల జెనిటో యూరినరీ సర్జన్స్ సొసైటీ రాష్ట్ర స్థాయి సదస్సును శనివారం డా.విక్రమసింహారెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని సౌజన్య కన్వెన్షన్ సెంటర్‌లో నంద్యాల, కర్నూలు జిల్లాల యూరాలజీ సంఘాల సంయుక్తంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల యూరాలజీ సం ఘం అధ్యక్షుడు డా.జగదీశ్వర్ అధ్యక్షతన కార్యదర్శి డా.శ్రీనివాస్, నిర్వాహక కమిటీ చైర్మన్ డా.సీతారామయ్య, నిర్వాహక కార్యదర్శి డా.భార్గవవర్ధన్‌రెడ్డి నిర్వహణలో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. డాక్టర్ విక్రమసింహా రెడ్డి మాట్లాడుతూ యూరాలజీ విభాగంలో గత దశాబ్ద కాలంలో అధునాతన వైద్య విధానాలు, పరికరాలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం వచ్చిందని అన్నారు. దక్షిణ భారత యూరాలజీ సంఘం కార్యదర్శి డాక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ యూరాలజీలో కూడా ఏఐ వినియోగంతో అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. నగరాలకే పరిమితమైన యూరాలజీ వైద్యం నేడు చిన్న పట్టణాల్లో కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. డాక్టర్ భార్గవవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాల వైద్యుల సహకారంతో ప్రప్రథమంగా సూపర్ స్పెషాలిటీ రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించడం గర్వకారణమని అన్నారు. నంద్యాలలో యూరాలజీ విభాగంలో మూత్రపిండాలు, మూత్రాశయ, మూత్రనాళ, జననేంద్రియ జబ్బులకు అత్యంత ఆధునిక వైద్య వసతులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ సదస్సుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 300 మంది యూరాలజీ వైద్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో వైద్యులు జైబాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దాసరి రమేష్, రవికృష్ణ, ఫనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు వెళ్తూ.. అనంత లోకాలకు

• స్కూటీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. యువతి దుర్మరణం

నందికొట్కూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా విధులను నిర్వహిస్తున్న యువతి రోడ్డుప్రమాదంలో దుర్మరణం చెందింది. ఈఘటన నందికొట్కూరులో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని హాజీ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ అలీం కూతురు షేక్ ఆఫ్రీన్(26) బీ.ఈడీ పూర్తి చేసి పట్టణంలోని శ్లోకా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ట్రైనీ టీచర్‌గా విధుల్లో చేరింది. శనివారం ఉదయం విధులకు తన స్కూటీపై వెళ్తున్న సమయంలో పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఇం డియన్ పెట్రోల్ బంకువద్ద ఆమె పెట్రోల్ వేయించుకుంది. కేజీ రోడ్డు పైకి రావడంతో ఆత్మకూరు నుంచి కర్నూలుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయా లపాలైన ఆఫ్రీన్‌ను పోలీసులు, స్థానికులు నందికొట్కూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



ప్రమాదానికి గురైన స్కూటీ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

• ఇద్దరికి తీవ్ర గాయాలు

నందికొట్కూరు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రెండు బైకులు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని కొణిదేల గ్రామం వద్ద శనివారం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. ఓబైకుపై చాకలి లింగన్న, అతని మనుమడు జశ్వంతులు నందికొటూరు నుంచి కొణిదేలకు వెళ్తున్నారు. మరో బైక్‌పై కొణిదేల నుంచి నందికొట్కూరు వైపుగా చెన్నయ్య అతని కుమారుడు శ్రీరాములు వెళ్తుండగా రెండు బైకులు ప్రమాదవశాత్తు ఢీకొనగాగొల్ల చెన్నయ్య(45) కిందపడ్డాడు. అదే సమయంలో కొణిదేల నుంచి నందికొట్కూరు వైపుగా మొక్కజొన్నల లోడుతో వెళ్తున్న లారీ అతడిపై ఎక్కింది. చెన్నయ్య అక్కడికక్కడే మరణించగా మృతదేహం మాంసపు ముద్దలా మారిపోయింది. తీవ్రంగా గాయపడిన వారిని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నందికొట్కూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.



బోల్తాపడ్డ బైక్

ట్యాంకర్ డ్రైవర్ మృతి



పరిశ్రమలో ఉద్యోగులను విచారిస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో ట్యాంకర్ డ్రైవర్ అదుపు తప్పి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాల మేరకు... ఉయ్యాలవాడ మండలం అల్లూరు గ్రామానికి చెందిన గురుప్రసాద్(30) రామ్‌కో సిమెంట్స్‌లో ఓ కాంట్రాక్టు కంపెనీ కింద ట్యాంకర్ డ్రైవర్ పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం సిమెంట్ ట్యాంకర్ లోడు చేసుకొని ట్యాంకర్‌పైకి ఎక్కి ట్యాంకర్‌కు కప్పు తగిలించే సమయంలో పట్టుతప్పి కింద పడి పోయాడు. తీవ్ర గాయాలైన అతడిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. సీఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం.. వ్యక్తి అరెస్టు



గంజాయితో పట్టుబడ్డ లక్ష్మన్న

వెల్దుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో గంజాయి పట్టుబడటం కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంజాయి తీసుకెళుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలో గోవర్ధనగిరి గ్రామానికి చెందిన ఎరుకల లక్ష్మన్నను మదార్‌పురం గ్రామ బస్టాండ్ సమీపంలో గంజాయిని తీసుకొని వెళుతుండగా సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ నరేశ్ తన పోలీసు సిబ్బందితో దాడులు నిర్వహించారు. అతనిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులలో అతని వద్ద నుంచి 900 గ్రాముల పచ్చి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. మండల వ్యవసాయ అధికారి అక్బర్‌బాషా పంచనామా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మంజుల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రేడియాలజీ దినోత్సవం



నివాళి అర్పిస్తున్న సిబ్బంది

నంద్యాల హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం ప్రపంచ రేడియాలజీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రేడియాలజీ పితామహుడు విలియం కాన్రాడ్ రోంట్‌జెన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిం చారు. రేడియాలజీ విభాగం ప్రొఫెసర్, హెచ్‌వోడీ డా.హరినాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఆర్‌ఎంవో డా.వెంకటేష్, న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ శ్యాంసుందర్, సైక్రియాటిస్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రవూఫ్, రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.శ్రావణ్‌కుమార్, ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఓబయ్య, సైక్రియాట్రిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.విక్రముల్లా, ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.మారుతి, రేడియో గ్రాఫర్లు డేవిడ్‌సుందరం, సత్యం, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు కడుపార భోజనం

• 2016 నుంచి 'రూ.15కే భోజనం' అమలు
• ఇస్కాన్ సహకారంతో నిర్వహిస్తున్న మార్కెట్ కమిటీ



రైతన్న తమ పంట దిగుబడులను అమ్ముకునేందుకు ఎంతో వ్యయప్రయాసలతో మార్కెట్ యార్డులకు వస్తారు. ఇక్కడ గంటల, రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు. అలాంటప్పుడు చేతిలో డబ్బులు లేక.. ఆకలితో అలమటించేవాడు. ఈ కష్టాన్ని గుర్తించిన కర్నూలు మార్కెట్ కమిటీ ఇస్కాన్ ధార్మిక సంస్థతో కలిసి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రూ.15కే భోజనం అందించేందుకు 2016లో అప్పటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ప్రారంభించారు. తొమ్మిదేళ్లుగా కష్టనష్టాలు ఎదురైనా రైతులకు నిత్యం భోజనం అందించేందుకు కృషి చేస్తోంది. ఇటీవలే ఉల్లి పంట దిగుబడులు తెచ్చినప్పుడు రైతులకు రెండు పూటలా (మధ్యాహ్నం, రాత్రి) కడుపార భోజనం అందించింది. ఈ పథకంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రైతులకు భోజనం వడ్డిస్తున్న సెక్రెటరీ, సిబ్బంది(ఫైల్)

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 8ఆంధ్రజ్యోతి): అన్నదాతల ఆకలిని తీర్చి వారికి కడుపార భోజనం అందిస్తోంది మార్కెట్ కమిటీ. రూ.15కే భోజన పథకం ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతోంది. ఇస్కాన్ సంస్థ సహకారంతో అధికారులు, పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. రైతులు కేవలం రూ.15లు, మార్కెట్ కమిటి రూ.20లు, మిగిలిన మొత్తాన్ని ఇస్కాన్ ధార్మిక సంస్థ భరించేలా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. 2016లో తెలుగుదేశం ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే మొదటిసారిగా ఈ పథకాన్ని డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి కర్నూలు మార్కెట్ యార్డులో ప్రారంభించారు. ఏటా లక్ష మంది రైతులు ఈ భోజన పథకం వల్ల ప్రయోజనం పొందుతున్నారు. అదే విధంగా ప్రతి సంవత్సరం రూ.12లక్షల దాకా ఈ పథకానికి ఖర్చు చేస్తున్నట్లు కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి తెలిపారు.

అర్ధాకలితో ఇంటి ముఖం..

చేతికందిన పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ యార్డులో కనీసం పంట సాగుకు తెచ్చిన పెట్టుబడులను కూడా వ్యాపారుల నుంచి దక్కని సమయాల్లో అర్ధాకలితోనే ఇంటి ముఖం పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కొంతలో కొంతైనా రైతులను ఆదుకోవాలని, వారి ఆకలి తీర్చాలని అప్పటి మార్కెట్ కమిటీ చైర్మన్ శమంతకమణి ఇస్కాన్ ధార్మిక సంస్థ ప్రతినిధులను ఒప్పించి తక్కువ ధరకే భోజనం అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగించడంలో కర్నూలు మార్కెట్ కమిటీ అధికారులు, పాలకవర్గం అంకిత భావంతో పని చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులంతా పంట ఉత్పత్తులను అమ్ముకుని యార్డులోనే కేవలం రూ.15కే కడుపార భోజనం చేస్తున్నారు.

రోజూ 500 మంది రైతులు

రైతుల కోసం తక్కువ ధరకే అమలు చేస్తున్న భోజన పథకానికి విశేష స్పందన కనిపిస్తుంది. రోజూ 500ల నుంచి 600 మంది రైతులు రుచిరకరమైన భోజనం చేస్తున్నారు. ఈ పథకానికి ఏటా రూ.12 లక్షల దాకా ఖర్చు చేస్తున్నామని, ఈ ఖర్చు పెరిగినా ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు. జిల్లా అంతటా ఈ భోజన పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఇస్కాన్ ప్రతినిధులు కర్నూలు మార్కెట్ యార్డులోనే భోజనం తయారు చేసి వాహనంలో ఆదోని మార్కెట్ యార్డు కూడా తీసుకెళ్లి అక్కడి రైతులకు భోజనం అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 15 మార్కెట్ కమిటీలలో కేవలం కర్నూలు, ఆదోని మార్కెట్ కమిటీలలోనే ఈ భోజన పథకం అమలు చేస్తున్నారు.



నిరంతరం అమలు చేస్తున్నాం

2016లో కర్నూలు మార్కెట్‌యార్డులో రూ.15కే భోజనం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఆటంకాలు లేకుండా నిరంతరం అమలు చేస్తున్నాం. ఇటీవల ఉల్లి రైతులకు రాత్రి పూట కూడా భోజనం అందించాం. **- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, మార్కెట్‌యార్డు, కర్నూలు**

కొనలేం.. తినలేం..!

• మండుతున్న కూరగాయల ధరలు
• వంకాయ కిలో రూ.46పైనే
• క్యారెట్ రూ.50, బీన్స్ రూ.70
• క్యాప్సికం రూ.70
• ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రైతుబజారులో కూరగాయలు కొంటున్న వినియోగదారులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు ఏమీ కొనలేని.. తినలేని పరిస్థితులు నెలకొన్నాయి. కూరగాయల ధరలు మండిపోతున్నాయి. పేదవర్గాలు పచ్చడి మెతుకులతోనే సరిపుచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి రోజూ వర్షం కురుస్తూనే ఉంది. కూరగాయల ధరలు మాత్రం దిగి రావడం లేదు. శనివారం సి.క్యాంపు రైతు బజారులో వంకా య రూ46, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.36, క్యారెట్ రూ.50, బీన్స్ రూ.70, చోళకాయలు రూ.60, బీట్‌రూట్ రూ.50, అల్లం రూ.94, క్యాప్సికం రూ.70, లావుమిర్చి రూ.60, ముల్లంగి బుడ్డలు రూ.60 ధర పలికింది. ఈ ధరలు చూసి కూరగాయలు కొనుగోలు కోసం రైతుబజారుకు వెళ్తున్న ప్రజలు గుండెలు బాదుకుంటున్నారు. సి.క్యాంపు రైతుబజార్, అమీన్ అబ్బాస్‌నగర్, కొత్తపేట రైతుబజారులో తప్పుడు తూకాలు, బోర్డుపై రాసిన ధరల కంటే రూ.5 ఎక్కువగా వసూలు చేస్తుండటంతో ఇదేమీ అన్యాయం అంటూ వినియోగదారులు లబోదిబోమంటున్నారు. ఎవ రైనా రైతుబజారు కార్యాలయానికి వెళ్లి సిబ్బందికి ఫిర్యాదు చేస్తే వారు వ్యాపారులను మందలిస్తున్నారు. ఎవరూ ఫిర్యాదు చేయకుంటే ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

కూరగాయల వినియోగం పెరిగింది



కార్తీక మాసంలో కూరగాయల వినియోగం పెరిగింది. అధిక వర్షాలతో కూరగాయలు, ఆకుకూరల దిగుబడులు తగ్గిపోయాయి. దీంతో ధరలు పెరిగాయి. ఎక్కడైనా స్టాల్స్ వద్ద కూరగాయల ధరలు బోర్డుపైన రాసిన దానికంటే ఎక్కువ ధర వసూలు చేస్తుంటే వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చు.

- కళ్యాణమ్మ, ఎస్టేట్ అధికారి, సి.క్యాంపు రైతుబజారు

పాఠశాల ఇలా.. చదువు ఎలా?

• శిథిలావస్థలో తిప్పాయిపల్లె పాఠశాల
• పంచాయతీ ఆఫీసులో తరగతులు



తిప్పాయపల్లెలో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల



పంచాయతీ కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

ఓర్వకల్లు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాయపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. ఇక్కడ తమ పిల్లలు ఉంటే ప్రమాదమని తల్లిదండ్రులు అభ్యంతరం తెలపడంతో విద్యార్థులకు పంచాయతీ కార్యాలయంలో చదువు చెబుతున్నారు. తిప్పాయపల్లె గ్రామంలో 1961లో పాఠశాలను ప్రారంభించారు. 64 సంవత్సరాలు గడిచినా నూతన భవనాలను నిర్మించలేదు. పాఠశాలలో 23 మంది విద్యార్థులు ఉండగా.. ఇద్దరు ఉపాధ్యా యులు చదువులు చెబుతున్నారు. గదులు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నాయి. పాఠశాల దుస్థితిని గమనించిన గ్రామస్థులు పంచాయతీ కార్యాలయంలో తగరతులు నిర్వహించుకునే ఏర్పాటు చేశారు.

అలాగే పాఠశాల సమీంలోనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రం కూడా శిథిలావస్థకు చేరింది. 22 సంవత్సరాల నిర్మించినది కావడంతో పెచ్చులు ఊడుతున్నాయి. టీచర్లు, చిన్నారులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీటిలో సోమయాజులపల్లె మజరా గ్రామం చెన్నంచెట్టిపల్లె, చింతలపల్లె గ్రామాని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నూతన భవనాలు నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నివేదికలు పంపాం



తిప్పాయపల్లె, చెన్నంచెట్టి పల్లె, చింతలపల్లె గ్రామాల్లో పాఠశాలలు అధ్వాన్నంగా ఉన్నాయని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సహ కారంతో ప్రభుత్వానికి నివేదకలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే నూతన తరగతి గదులు నిర్మిస్తాం. **- ఓంకార్ యాదవ్, ఎంఈవో ఓర్వకల్లు**

ప్రజా ఉద్యమానికి తరలిరావాలి

• వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న జరిగే ప్రజా ఉద్యమానికి తరలిరావాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ భవనంలో పోస్టరు ఆవిష్కరించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేద యువతకు వైదవిద్య దూరమవుతుందున్నారు. పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



పోస్టరును విడుదల చేస్తున్న ఎస్వీ మోహన్ రెడ్డి

● వైసీపీ జిల్లా కార్యాలయంలో భక్త కనకదాసు 538 జయంతిని పురస్కరించుకొని నివాళులర్పించారు ఇన్‌చార్జి ఎస్వీ మోహన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయమనోహరి, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ పాల్గొన్నారు.

'అనాథల హక్కులను కాపాడాలి'

కర్నూలు కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనాథలకు న్యాయహక్కులు కాపాడడం మన బాధ్యత అని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయాధికారి వెంకట హరినాథ్ అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, లీలా వెంకట శేషాద్రి సూచనల మేరకు, వెంకట హరినాథ్, లీగల్ సర్వీసెస్ యూనిట్ సభ్యులు, లీగల్ వలంటీర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, విశ్రాంత డీఎస్పీ పాపారావుతో కలిసి కంపాషన్ సొసైటీ హోమ్ ఆఫ్ హోప్‌ను తనిఖీ చేశారు. అక్కడ సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. అనాథలకు ఎవరికైనా న్యాయ సహాయం అవసరం అయితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబరు 15100ను సంప్రదించాలని సూచించారు.

హైకోర్టు ఏజీపీగా మాలపల్లి వాసి



మఠం శివస్వామి

మంత్రాలయం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన మఠం శివస్వామి అమరావతి హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. శుక్రవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మాలపల్లికి చెందిన మల్లికార్జున స్వామి, మల్లేశ్వరమ్మల కొడుకు శివస్వామి. స్థానిక పాఠశాలలో 5వ తరగతి వరకు, మండలంలోని విద్యనగర్ ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలో 10వరకు చదివారు. శనివారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు గురెడ్డి భీమిరెడ్డి అభినందనలు తెలిపారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

చకచకా రహదారుల విస్తరణ

● నగర పాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్



కర్నూలు న్యూసిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నగరంలోని రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. శనివారం మాట్లాడుతూ బళ్లారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ నియంత్రణకు బైపాస్ నిర్మాణం పూర్తయిందని, గడియారం ఆసుపత్రి, బండిమెట్ట ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగిస్తున్నామనారు. అలాగే పాతబస్టాండు అంబేడ్కర్ కూడలి నుంచి పెద్ద మార్కెట్ వరకు విస్తరణ ప్రక్రియ త్వరలోనే ప్రారంబిస్తామని తెలిపారు. నందికొట్కూరు రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నా యని, తాజాగా మెడికల్ కళాశాల మలుపు వద్ద విస్తరణకు మార్గం సుగమమైందన్నారు. కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు విస్తరణకు ఆస్తి కోల్పోయే బాధితులతో మంత్రి టీజీ భరత్ సమావేశం నిర్వహించగా ఇప్పటి వరకు 25 మంది పత్రాలు సమర్పించి అంగీకారం తెలిపారన్నారు.

సీమ గుండెచప్పుడు పప్పూరి రామాచార్యులు



నివాళి అర్పిస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ గుండెచప్పుడు పప్పూరి రామాచార్యులని రాయలసీమ విద్యార్థి సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు సీమ కృష్ణ రాథోడ్ అన్నారు. శనివారం కార్యాలయంలో 129వ జయంతి నిర్వహించారు. రాయలసీమకు నీళ్లు, నిధులు, నియామకాలు కావాలని పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. గణేష్, భూషన్, రాయలసీమ విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ సేవకుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న షేక్ బందగి సాహెబ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ సేవకుల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగి సాహెబ్ డిమాండ్ చేశారు. శనివారం కేకే భవన్‌లో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని విమర్శించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు బి.రామాంజనేయులు, అధ్యక్షుడు ఏ.రాజు, కార్యదర్శి బిటి.అయ్యస్వామి, వర్కింగ ప్రెసిడెంట్ ఎం.రాజు, కోశాధికారి టి.అశోక్, ఉపాధ్యక్షులు కే.మల్లయ్య, బి.హనుమంతు, సహాయ కార్యదర్శులు హెచ్.భీమలింగ, రంగన్నతోపాటు, సభ్యులుగా పదిమందిని ఎన్నుకున్నారు.

అపరిచితులకు వివరాలు చెప్పకండి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వేణుగోపాల్‌రాజు

సి. బెళగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అపరిచితులు ఫోన్ చేస్తే బ్యాంకు ఖాతాలు, ఓటీపీ వివరాలు చెప్పవద్దని ఎస్ఐ వేణుగోపాల్‌రాజు సూచించారు. శనివారం మండలంలోని గుండ్రేవుల గ్రామంలో గ్రామస్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులు ఫోన్‌చేసి ఓటీపీ నెంబర్, బ్యాంకు వివరాలు చెప్పమని అడిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కానిస్టేబుల్ శ్రీనివాసులు, తిమ్మప్ప, శ్రీరాములు ఉన్నారు.

నేడు బ్రాహ్మణ సంఘం వనభోజనం

కర్నూలు కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనం ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ప్రకటనలో తెలిపారు. నగరంలోని సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

నగర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

నగర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నగరంలోని సుంకేసుల రోడ్డులోగల ఎస్ఎల్ఎన్ గార్డెన్స్‌లో వనభోజనం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు కస్తూరి వేమయ్య, మేడం సుంకన్న, కోశాధికారి గుర్రం శివప్రసాద్ ప్రకటకలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచీ సాయంత్రం 6 గంటల వరకు ఈ వేడుకలు కొనసాగుతాయన్నారు. ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం



పోలకల్లు గ్రామంలో బోల్తాపడిన ట్రాక్టర్

సి.బెళగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు గ్రామంలోని కోళ్లఫారం వద్ద ట్రాక్టర్ బోల్తాపడింది. గూడూరుకు చెందిన మధు ఎపీ39 హెచ్‌క్యూ 7997 నంబరుగల ట్రాక్టర్‌లో పోలకల్లుకు గూడూరు నుంచి బయలుదేరగా, ట్రాక్టర్ బొల్తా పడింది. గ్రామస్తులు డ్రైవర్‌ను బయటకు తీశారు, అయితే ఎటువంటి ప్రమాదం జరగలేదు.

ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

కల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ప్రజా ఉద్యమం పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈనెల 12న నివాసం నుంచి కల్లూరు తసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

కాలనీల్లో మురుగు..



41వ వార్డు నాగేంద్రనగర్‌లో ఇళ్ల మధ్యనే మురుగు



గడియారం ఆసుపత్రి వద్ద కాలువ

కల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్బన్ 41వ వార్డు నాగేంద్రనగర్‌లో పారిశుధ్య నిర్వహణ లేదు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగు నిలిచి స్థానికులు అవస్థలు పడుతున్నారు. పలుమార్లు నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాద చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

మురికి కాలువల్లో...చెత్తా..చెదారం..

కర్నూలు న్యూసిటీ: నగరంలోని గడియారం ఆసుపత్రి వద్ద కాలువల్లో చెత్తాచెదారం ఉంది. పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో దుర్వాసన వస్తోంది. నగరం నడిబొడ్డున ఇలా ఉందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

హాకీ విజేత మున్సిపల్ హై స్కూల్ జట్టు



హాకీ విజేత మున్సిపల్ హై స్కూల్ జట్టుతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో హాకీ శతాబ్ది క్రీడాల్లో బాలుర విభాగంలో మున్సిపల్ హై స్కూల్ మెయిన్ జట్టు విజేతగా నిలిచింది. శనివారం అవుట్‌డోర్ స్టేడియంలో ఫైనల్ పోటీల్లో మాంటి ఇంగ్లీష్ మీడియం స్కూలు జట్టు పై 1-0 తేడాతో గెలుపొందింది. విజేతలకు జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, పవర్ లిఫ్ట సెక్రటరీ వేణుగోపాల్, హాకీ సంఘం వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ అరుణ్, రవికుమార్, మహేష్, మనోహర్, వీరేష్, పెద్దయ్య, ఖలీల్ తదితరులు అభినందించి ట్రోఫీని అందజేశారు.

కనకదాసుకు నివాళి అర్పించిన ఎంపీ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శీభక్త కనకదాసు సమాజంలో సమానత్వం, భక్తి భావనలకు మార్గదర్శకుల య్యారనీ ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. భక్తకనకదాసు జయంతి సందర్భంగా శనివారం బీసీ భవన్ ప్రాంగణంలో విగ్రహానికి నివాళి అర్పించారు. కలిసికట్టుగా పోరాడితే ఏదైనా సాధించగలరని భక్త కనకదాసు తన కీర్తనల ద్వారా చైతన్యం చేశారన్నారు. బక్త కనకదాసు జయంతిని అధికారిక కార్యక్రమంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, కురువ సంఘం డైరెక్టర్లు రామకృష్ణ, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

గూడూరు: బీరప్ప ఆలయంలో ఎంపీ పూజలు చేసిన అనతరం బస్టాండ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు

సమాజానికి మార్గదర్శి భక్త కనకదాసు : ఎమ్మెల్యే

సమాజానికి భక్తకనకదాసు మార్గదర్శి అని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. శనివారం బీక్యాంపులోని బీసీ భవన్ వద్ద భక్తకనకదాసు విగ్రహానికి నివాళి అర్పించారు.

ఓర్వకల్లు: మండల కేంద్రంలో భక్త కనకదాసు జయంతి శనివారం కురువ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కనకదాసు సామాజిక తత్వవేత్తగా, స్వర్ణకర్తగా కీర్తనల ద్వారా సమాజంలోని కులవివక్షను రూపుమాపేందుకు కృషి చేశారన్నారు. అల్లాబాబు, పెద్దయ్య, అల్లాస్వామి, రామయ్య, నాగరాజు, శేషన్న, నడిపి స్వాములు, శ్రీదేవి, నారాయణమ్మ, చిన్నమ్మ, వెంగన్న తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల ఇన్ సర్వీస్ శిక్షణకు అనుమతి

● మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు బాలునాయక్



మాట్లాడుతున్న బాలు నాయక్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య ఉద్యోగులు ల్యాబ్ అటెండెంట్, ల్యాబ్ టెక్నీసియన్, ఈసీజీ టెక్నీషియన్, ఎక్స్‌రే టెక్నీషియన్‌లకు ఇన్‌సర్వీస్ శిక్షణ పొందడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.బాలు నాయక్ పేర్కొన్నారు. శనివారం కర్నూలు జీజీహెచ్‌లో యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆసక్తిగల వారు యూనియన్ తరఫున ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకో వాలన్నారు. గతంలో ఎంఎన్ఎస్ అదనపు హెచ్‌ఆర్‌ఏ తొలగించారనీ, దీనిపై డీఎంఈని కలిసి వినతి పత్రం సమర్పించామన్నారు. జీజీహెచ్ బ్రాంచ్ సెక్రటరీ కాజామొద్దీన్, హరిచంద్రనాయుడు, శశిరెడ్డి, సుశీలమ్మ, బాగ్యమ్మ, ఉరుకుందయ్య, గీతా కళ్యాణి పాల్గొన్నారు.

గీతాంజలి కళాశాలలో ఫుడ్ మేళా



ఫుడ్ మేళాలో పాల్గొన్న కాలేజీ అధినేత విజయవర్ధన్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాయత్రీ ఎస్టేట్స్ గీతాంజలి నర్సింగ్ కళాశాలలో 2024-25 బ్యాచ్ మొదటి సంవత్సరంలో విద్యార్థులకు శనివారం ఫుడ్ మేళా నిర్వహించారు. వివిధ రకాల ఇన్‌గ్రేడియన్స్‌తో వంటలను ప్రదర్శించారు. విటమిన్స్, కాల్షియం, ఐరన్ తదితర పదార్థాలు ఉన్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన వంటకాలను కాలేజీ అధినేత పెరుగు విజయవర్ధన్ రెడ్డి పరిశీలించి అభినందించారు. వంటకాల్లో ఎవరికి ఎంత నిష్పత్తిలో రోజువారి ఆహారంలో ఎంత తీసుకోవాలో తెలియజేశారన్నారు. ప్రిన్సిపాల్ వసంత కుమారి, కోఆర్డినేటర్ సురేఖ కాలేజీ బోధన సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఓర్వకల్లు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ట్రైనీ ఎస్ఐ అఖిల్ కుమార్ సూచించారు. శనివారం ఓర్వకల్లు జాతీయ రహదారిపై వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రాంగ్ రూట్, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. ఏఎస్ఐ పాండు రంగడు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అన్నదానం ప్రారంభం

కర్నూలు కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బళ్లారి చౌరస్తా వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ దీక్షదారులకు మధ్యాహ్నం అనదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మార్గశిర మాస శుక్లపక్షం ఏకాదశి ఈనెల 30 వరకు ఈ కార్యక్రమం ప్రతిరోజూ మధ్యాహ్నం కొనసాగుతుందని తెలిపారు.

రేపు కేఎంసీలో వైద్య విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న ఎండోక్రైనాలజీ హెచ్‌వోడీ డా.పి.శ్రీనివాసులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ వ్యాధి నివారణ దినం సందర్భంగా 10వ తేదీన కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎండోక్రైనాలజీ హెచ్‌వోడీ డా.పి.శ్రీనివాసులు వెల్లడించారు. శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎండో క్రైనాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా.పి.రాధారాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సయ్యద్ హలీంతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎముకల ఆరోగ్యం డయాబెటిస్‌పై హైదరాబాద్ నిజాం ఇన్‌స్టిట్యూట్ ఎండోక్రైనాలజీ విభాగానికి చెందిన అడిషినల్ ప్రొఫెసర్ అండ్ హెడ్ డా.బీట్రిస్ అంశంపై ఎముకల ఆరోగ్యం, డయాబెటిస్ పై ఉపన్యసిస్తాన్నారు. బాధితులకు ఎముకలు బలహీనంగా ఉంటాయని, సుగర్‌ను అదుపులో ఉంచుకోవాలన్నారు. జీజీహెచ్ ఎండోక్రైనాలజీ విభాగం న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో డెక్సాస్కాన్ అందుబాటులో ఉందని, ఈస్కాన్ అస్టియోపోరాసిస్ ఎంత ఉందో తెలుసుకోవచ్చునన్నారు.

29న భగవద్గీత పోటీలు

కర్నూలు కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 29న భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీలు జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనక విజ్ఞాన పీఠం పాఠశాల్లో నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ మాణిక్యరెడ్డి ప్రకటనలో తెలిపారు. 3 నుంచి 5 తరగతుల వారికి 1 నుంచి 10 శ్లోకాలు, 6, 7 తరగతుల వారికి 1 నుంచీ 15 శ్లోకాలు, 8, 9 తరగతుల వారికి 1 నుంచి20 శ్లోకాల వరకు కంఠస్థం చేసి చెపాల్సన్నారు. నగరంలోని పాఠశాలలకు భగవద్గీతలోని పదకొండవ అధ్యాయం 'విశ్వరూప సందర్శన యోగం'లోని శ్లోకాలు కరపత్రాల ద్వారా అందజేశామన్నారు.

26న దేశవ్యాప్త నిరసన

కర్నూలు న్యూసిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 26న నిరసన చేయనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. శనివారం సీఆర్ భవన్‌లో డిప్యూటీ కార్యదర్శి ఎం.క్రిష్ణయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అన్నారు. మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్లను తీసుకువచ్చి కార్మికుల ప్రయోజనాలను కాలరాసిందన్నారు. జే.లలితమ్మ, రమేష్‌బాబు, మనోహర్‌మాణిక్యం, మక్బూల్, మునెప్ప, చంద్రశేఖర్ ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వంట గదిని పరిశీలిస్తున్న డాక్టర్ రేఖ

ఓర్వకల్లు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ రేఖ సూచించారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు శనివారం కాల్వబుగ్గ ఏపీఆర్ గురుకుల పాఠశాల పరిసరాలను, వంట గది, స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే దస్తగిరి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే

కరక్నూలు రూరల్ నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే ద్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. పసుపుల గ్రామంలోని స్వగృహంలో గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా టీడీపీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వం ఉండి మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. శనివారం 26, 31 వార్డులకు చెందిన కార్యకర్తలకు రూ.5లక్షల చెక్కులను అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 31వ వార్డు శరీన్‌నగర్ నాగన్న, విద్యుదాఘా తంతో మృతి చెందిన 26వ వార్డు తారకరామనగర్‌కు చెందిన శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇన్‌చార్జ్‌లు శైలజాయాదవ్, చరణ్‌కుమార్ యాదవ్, వెంకటస్వామి, గోవిందు, రవి, శ్రీను, మల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

ఓర్వకల్లు: కొమ్ముచెరువు ఆంజనేయస్వామికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి శనివారం పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. మొక్కులు చెల్లించుకుని, నాగులపుట్టకు పూజలు చేశారు. ఎమ్మెల్యేకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు.

ఫార్మసీ ప్లేస్‌మెంట్ డ్రైవ్



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఔషధ సంస్థ డీవీఈఎస్ ల్యాబొరేటరీస్ హెచ్‌ఆర్‌లో ప్రతాప్ రాయుడు, శ్రీహరి ఆధ్వర్యంలో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ డా.కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ విజయలక్ష్మమ్మ, ప్రిన్సిపాల్ డా.బీవీ రమణ అభినందించారు.

వైద్యరంగంలో రేడియాలజీ కీలకప్రాత



మెడికవర్ ఆసుపత్రిలో రేడియాలజిస్టులు



డా.కృష్ణా నాయక్‌కు సన్మానం

కర్నూలు హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో రేడియాలజీ విభాగం కీలక ప్రాత వహిస్తుందని మెడికవర్ హాస్పిటల్ రేడియాలజీ హెడ్ డా.సీ.ఏ.సంతోష్ వర్మ, రేడియాలజిస్టు డా.కిరణ్ అన్నారు. వరల్డ్ రేడియాలజీ డే సందర్భంగా మాట్లాడుతూ రేడియాలజీ ద్వారా నాణ్యమైన సేవలు అందిస్తున్నామన్నారు. న్యూరో ఫిజిషియన్ డా.ఎం.నాగసురేష్, న్యూరోసర్జన్ డా.విశ్వకుమార్ పాల్గొన్నారు.

విశ్వభారతి వైద్య కళాశాలలో..

రేడియాలజీ పరీక్షలతో ఖచ్చితత్వమైన వ్యాధి నిర్థారణ సాధ్యమని విశ్వభారతి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కృష్ణా నాయక్ అన్నారు. శనివారం విశ్వభారతి మెడికల్ కాలేజీలో రేడియాలజి ప్రొఫెసర్లు డా.అబ్దుల్ గఫూర్ డా.ఓ.జోజిరెడ్డి ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. క్విజ్ పోటీల్లో గెలుపొందిన పీజీ, నర్సింగ్, పారా మెడికల్ విద్యా ర్థులకు బహుమతులు అందజేశారు. రేడీయాలజిస్టులు డా.రఘునాథరెడ్డి, డా.అభిషేక్, డా.సందీప్, డా.అనిత పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నిర్వహించిన సీబీఎస్ఈ రీజనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో రిడ్జ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు సీఈవో గోపీనాథ్ తెలిపారు. బరువైన బ్యాగులతో ఇబ్బంది పడతారని, ఈ స్మార్ట్ బ్యాగ్ బరువును సమానంగా పంపిణీ చేయడంతో పాటు సెన్సర్ల ద్వారా విద్యార్థికి తగిన రీతిలో బ్యాగ్ మోస్తున్నాడో లేదో గుర్తించి అలర్ట్ చేస్తుందన్నారు. గ్రేడ్-8 విద్యార్థులు ఎస్.చారిత, జి.తన్విశ్రీ సృజనాత్మకత ఆలోచనతో పరిష్కారం అందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించారని తెలిపారు. కోఆర్డినేటర్ సీఈవో సౌమ్య గోపినాథ్, డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపాల్ రాజ్‌కమల్ అభినందించారు.

నవ గ్రహాల ప్రతిష్ఠ

సి.బెళగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారందొడ్డి గ్రామంలో బోడ్రాయి, నవగ్రహాలను శనివారం ప్రతిష్ఠించారు. మూడు రోజుల నుంచి వేదపండితులతో హోమాలు నిర్వహించయాకె, గ్రామ పెద్దలు, వేద పండితులచే ఆడపడుచులకు బియ్యం బేడలు, నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం గ్రామంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. గ్రామ పెద్దలు, సర్పంచులు, ఎంపిటీసీలు, మాజీ సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు

వర్షపు నీటి తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న పనులు

గూడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయితీలోని 1వ వార్డు ఎస్సీకాలనీలో వర్షపునీటి తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షపునీరు ఇళ్లలోకి రావడంతో స్థానికులు టీడీపీ నాయకుడు సృజన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డికి సమస్యను వివరించగా, తొలించాలని నగర పంచాయతీ కమీషనర్‌కు సూచించారు. వనివారం ఎక్సకవేటర్‌తో కాలు వలు ఏర్పాటు చేసి నిల్వనీటిని తొలగించారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

11న లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణోత్సవం



కల్యాణోత్సవ పోస్టర్లను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆస్పరి రహదారిలో కొలువైన లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 11న స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు కాపు బలిజ సంఘం అధ్యక్షుడు రంగస్వామి కార్యదర్శి చందం మల్లికార్జున తెలిపారు. శనివారం కళ్యాణోత్సవ గోడపత్రికలను విడుదల చేశారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని 11న ఉదయం 8 గంటలకు పంచామృత, అభిషేకం, అలంకరణ, వార్షికోత్సవంతో పాటు స్వాములవారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదానం సాయంత్రం 6 గంటలకు కార్తీకదీపం ఉంటుందన్నారు. భక్తులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గృహాల దరఖాస్తుకు గడువు పెంపు

మద్దికెర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా గ్రామాల్లో స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేందుకు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచినట్లు హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ వరకు గడువు ఉండేదని, సక్రమంగా యాప్ పని చేయకపోవడంతో గడువు పెంచారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే వారు సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఒక్కో గృహానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.80లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.50వేలు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మండగిరి కొండపై వనభోజనాలు



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలం మండగిరి రామలింగేశ్వరస్వామి దేవాలయం (కొండ ప్రాంగణంలో) ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు కార్తీక వనభోజనం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు, ఈ కార్యక్రమానికి రైతులు తరలివచ్చి జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కారుమంచి, రైతుసంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సురేంద్రకుమార్‌లు కోరారు. శనివారం స్థానిక సి.ఆర్.భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ రైతుసంఘం ఆధ్వర్యంలో ప్రతి కార్తీకమాసంలో రైతు వనభోజన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా చేపట్టడం జరుగుతుందన్నారు. మండగిరి రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగే ఈ రైతు వనభోజన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రకృతి వ్యవసాయరంగ నిపుణులు గంగాధరం, రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, మండల వ్యవసాయ అధికారి వెంకటరాముడు పాల్గొంటారన్నారు. ఎంతో ప్రాధాన్యత గల ఈ కార్తీక వనభోజన కార్యక్రమానికి రైతులు పార్టీలకు అతీతంగా తరలిరావాలని కోరారు.

భక్త కనకదాసుకు ఘన నివాళి



ఆదోని: నాగలాపురంలో..



ఆలూరులో కనకదాసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ఆదోని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలాపురం గ్రామంలో భక్త కనకదాసు జయంతిని ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు మారుతినాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, మాజీ సర్పంచ్ లింగన్న, ఉరుకుందు, బసవరాజ్, మల్లేష్, నరసింహులు పాల్గొన్నారు.

ఆలూరు: భక్త కనకదాసు జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఆర్ఐ బసవన్నగౌడ్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. భక్త కనకదాస్ ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయించి ఎందరినో తన పాటలతో భక్తి భావాన్ని పెంపొందించారన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు రవి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: భక్త కనకదాసు జయంతి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని ఆలూరు, మొలగవల్లి, పెద్దహోతూరు తదితర గ్రామాల్లో భక్త కనకదాసు జయంతి సందర్భంగా బీరప్ప డోలు, గొరవయ్యల నృత్యాలతో కనకదాసు చిత్రపటాన్ని మొలగవల్లి, పెద్దహోతూరు తదితర గ్రామాల్లో గ్రామ పురవీధులగుండా ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టీడీపీ యువ నాయకుడు కురువ రఘురాజు, బెలగంటి హనుమప్ప, వైస్ ఎంపీపీ కురువ శ్రీరాములు .రామ్మోహన్, లక్ష్మిరెడ్డి, కె.వి.రామాంజనేయులు పాల్గొన్నారు.

పత్తికొండ: భక్తకనకదాసు జయంతిని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తకనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కుర్వసంఘం మరియు మదాసి, మాదారి, కురువసంఘం నాయకులు పాల్గొనడం జరిగింది.



ఆలూరు రూరల్: మొలగవల్లిలో..



పత్తికొండలో..

లోకేశ్ దృష్టికి కురువల సమస్యలు

● సమస్యలు, కుల ధ్రువీకరణ పత్రాలపై మంత్రి లోకేశ్‌తో ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప భేటీ

ఆదోని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను కళ్యాణదుర్గం పర్యటన సందర్భంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి లోకేశ్ దృష్టికి పలు కీలక సమస్యలు, డిమాండ్లను తీసుకొచ్చారు. ఆదోని సమస్యలు, ఎస్సీ సర్టిఫికెట్లపై, ప్రధానంగా ఆదోని ప్రాంత సమస్యలను మంత్రి లోకేశ్‌కు కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప వివరించారు. ఈ ప్రాంతంలోని కురువ కులస్తులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఉన్న జాప్యాన్ని ప్రస్తావించారు. ముఖ్యంగా మాదాసి కురుబ, మాదారి కురుబ వంటి ఉప కులాలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ ప్రక్రియను సరళీకృతం చేసి వేగవంతం చేసేందుకుగానూ ఎస్సీ సర్టిఫికెట్లను జారీ చేసే అధికారాన్ని తహసీల్దార్‌లకు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు. చైర్మన్ దేవేంద్రప్ప విజ్ఞప్తులపై మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించినట్లు దేవేంద్ర తెలియజేశారు. ఆదోని సమస్యల పరిష్కారంపై వెంటనే దృష్టి సారిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే ఎస్సీ సర్టిఫికెట్ల జారీకి సంబంధించిన అంశాన్ని పరిశీలించి త్వరలోనే అనుకూల నిర్ణయం తీసుకుంటామని, తహసీల్దార్‌లకు అధికారులు ఇచ్చే విషయంపై ఉన్నతాధికారులతో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని దేవేంద్రప్ప తెలిపారు. ఈ భేటీతో కురుబ సామాజికవర్గంలో నెలకొన్న సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయని ఆ వర్గం ఆశాభావం వ్యక్తం చేసింది.



మంత్రి నారా లోకేశ్‌తో ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప

బీసీలే టీడీపీకి వెన్నెముక

ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి



హాలహర్విలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వైకుంఠం జ్యోతి

హాలహర్వి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీలు రాజకీయంగా ఎదగాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని, వారే పార్టీకి వెన్నముకగా భావించామని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. శనివారం హాలహర్విలో నూతన పార్టీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు పూర్తిస్థాయిలో బీసీలకే అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని, గ్రామస్థాయిల కమిటీల్లోనూ బీసీలనే ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ నెలలోనే అన్ని పదవులను భర్తీ చేసి ప్రమాణస్వీకారం చేయించేలా అధిష్టానం నిర్ణయం తీసుకుందని, అందువల్ల పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపునిచ్చి వారి ఎదుగుదలకు దోహదపడతామన్నారు.

చంద్రబాబుతోనే ప్రగతి

పల్లెలు అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. శనివారం నిట్రవట్టి గ్రామంలో రూ.50లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. త్వరలోనే ఊరంతా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టి పల్లెల అభివృద్ధిని పరుగులు పట్టిస్తామన్నారు. అనంతరం కనకదాసు జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన మహిమలను కొనియాడారు. కురువలంతా రాజకీయంగా ఎదగాలంటే తెలుగుదేశం పార్టీలో కీలకపాత్ర పోషించాలని, ప్రతి గ్రామంలోనూ పార్టీ అభివృద్ధికి సైనికుల్లా పని చేయాలన్నారు. చంద్రబాబునాయుడు కురువల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బిల్లేకల్ వెంకటేశులు, యువ నాయులు ıధర్, సీనియర్ నాయకులు గూళ్యం ప్రకాష్, నిట్రవట్టి తిప్పేస్వామి, లక&న్న, మారుతి, ప్రహ్లాదరెడ్డి, బీజేపీ నాయకులు బసవరాజు పాల్గొన్నారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ

ఆస్పరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆస్పరి అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌ను పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఇటీవలే హైదరాబాద్‌లో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన అలిగేర, చిన్నహోతూరులో ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు గురించి తెలుసుకున్నారు.

ఆదోనిలో కళాభిషేకం



నల్లారెడ్డికి ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆదోని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలోని అనంత మంగళ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంజన్నప్ప 'కళాభిషేకం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదోని డివిజన్ కళాకారుల ప్రతిభ వెలికితీయడానికి ఇంటర్వ్యూ చేశారు. రుద్రాక్షలు మహేష్, డాక్టర్ జి.నల్లారెడ్డి, వల్లిసాబ్, చిగిలి లక్ష్మన్న యాదవ్ వంటి పలువురు కళాకారులు పాల్గొన్నారు. డాక్టర్ నల్లారెడ్డి మాట్లాడుతూ కళాకారుల నైతిక విలువలు సమాజానికి అత్యంత అవసరమని, ప్రభుత్వం వారికి ఐడెంటిటీ కార్డులు, పెన్షన్, ఇళ్ల స్థలాలు వంటి సౌకర్యాలు కల్పించి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్యవైశ్యుల వనభోజనం



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

మద్దికెర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామ శివారులో వీరతయ్య శివాలయం ఆవరణంలో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలను నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఉసిరి వృక్షానికి, తులసి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. శివాలయంలో స్వామివారికి పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక మాసంలో ఉసిరి చెట్టు కింద భోజనం చేస్తే మంచి జరుగుతుందని ఉద్దేశంతో గ్రామంలోని ఆర్యవైశ్య కులస్థులందరూ వెళ్లి ఆట పోటీలతో పాటు సరదాగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి పండుగను ఘనంగా జరుపుకున్నారు.

నేడు కమ్మ సంఘం వన భోజనాలు

పత్తికొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ నియోజకవర్గం కాకతీయ కమ్మసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పత్తికొండలో వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆసంఘం అధ్యక్ష కార్యదర్శులు వేలురూ రామయ్య, జరగమ్‌రామ్‌బాబు తెలిపారు. పట్టణంలోని ఆదోని రహదారిలోని ఎం కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9గంటలకు కార్యక్రమాలు ప్రారంభమౌతాయన్నారు. నియోజకవర్గ పరిధిలోని కమ్మ సంఘం సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆలూరులో బీజేపీ పాగా..!

● బీజేపీలోకి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సమీప బంధువు నారాయణ సతీమణి కమలమ్మ

● ఆలూరులో భారీ సభకు సన్నాహాలు

ఆలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలో బీజేపీ పాగ వేసింది. వైసీపీ, టీడీపీల నుంచి నాయకులు, కార్యకర్తలు బీజేపీ పార్టీలో చేరడంపై టీడీపీ ఇటు వైసీపీ పార్టీలకు షాక్ తగిలినట్లయ్యింది. శుక్రవారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ సమక్షంలో టీడీపీకి చెందిన ఆలూరు మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ సతీమణి గుమ్మనూరు కమలమ్మ, వైసీపీకి చెందిన ఆలూరు జెడ్పీటీసీ ఏరూరు శేఖర్, చిప్పగిరి వైస్ ఎంపీపీ నరసింహులు, ఖాజీపురం సర్పంచ్ భీమా, మూసానహళ్లి గ్రామ సర్పంచ్ పార్వతి భర్త సోమశేఖర్, టీడీపీకి చెందిన అరికెర గ్రామ సర్పంచ్ నాగరాజుతో పాటు మరో 20 మంది వైసీపీ, టీడీపీకి చెందిన కార్యకర్తలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆలూరు నియోజకవర్గంలో బీజేపీ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని నూతనంగా పార్టీలోకి చేరిన గుమ్మనూరు కమలమ్మ, ఏరూరు శేఖర వైస్ ఎంపీపీ వెంకటేష్, సర్పంచ్‌లు శనివారం తెలిపారు. మరోవైపు బీజేపీలో చేరిన గుమ్మనూరు కమలమ్మ మాజీ మంత్రి, ప్రస్తుత గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సమీప బంధువు కావడంతో నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టీడీపీలో ప్రాధాన్యత లేకపోవడంతో బీజేపీలో చేరినట్లు మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గుమ్మనూరు జయరాంకు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతికి రాజకీయ విబేధాలు తీవ్రస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో ఆయన సమీప బంధువు భార్య కమలమ్మ బీజేపీలో చేరడంలో ఆంతర్యం ఏమిటని రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చ సాగుతుంది. త్వరలోనే భారీగా బీజేపీలోకి చేరికలు ఉంటాయని వారు తెలిపారు. గుమ్మనూరు కమలమ్మ ఆధ్వర్యంలో ఆలూరులో రాష్ట్ర బీజేపీ నేతలతో భారీ సభ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా బీజేపీలో చేరింది మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం అనుచరులే అని ఎమ్మెల్యే విరుపాక్షి అంటున్నారు. జెడ్పీటీసీ ఏరూరు శేఖర్ మొదటి నుంచి పార్టీకి దూరంగా ఉంటున్నాడని ఎమ్మెల్యే చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఆలూరు నియోజకవర్గంలో బీజేపీ చేరికలు టీడీపీ, వైసీపీ పార్టీలలో తీవ్ర కలకలం రేపింది. బీజేపీలో చేరింది వైసీపీ కోవర్టులే అని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అంటున్నారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమక్షంలో బీజేపీలో చేరిన గుమ్మనూరు కమలమ్మ, పక్కనే మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ (ఫైల్)

ఆదోనిని జిల్లా చేయకుంటే అధోగతే

● ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అసోసియేషన్ కన్వీనర్



ఏ. ఆదినారాయణ

ఆదోని టౌన్ , నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజకీయంగా, పారిశ్రామికంగా, అభివృద్ధి పరంగా పూర్తిగా వెనుకపడ్డ ఆదోని డివిజన్ కేంద్రాన్ని చేయకుంటే ఈ ప్రాంత పరిస్థితి అధో గతిగా మారుతుందని ఆదోని ఏరియా డెవలప్మెంట్ అసోసియేషన్ కన్వీనర్ ఎస్ ఆదినారాయణ అన్నారు. ఆయన శనివారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కొత్త జిల్లాల రూపకల్పన పై ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర మంత్రులతో కూడిన కమిటి పర్యటించి అనేక అంశాలను పరి గణలో తీసుకొని ప్రభుత్వానికి స్థానిక ప్రజలలో తీవ్ర నిరాశ, నిస్పృహలు అలుముకున్నాయని ఆవేదన వెళ్లిబుచ్చారు. జిల్లా ఏర్పాటు విషయంలో ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా రాజకీయాలు చోటు చేసుకోవడం పట్ల డివిజన్ ప్రజలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ఈ నెల పదో తేదీన జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత కలిగిన దృష్టితో ఆదోని జిల్లా ఏర్పాటుతోపాటు, ఆదోని మండలంల పునర్విభజనలో పెద్ద హరివాణం, పెద్ద తుంబలం, ఆదోని రూరల్, ఆదోని అర్బన్ ఏర్పాటుకు మంత్రివర్గం సానుకూలంగా నిర్ణయం తీసుకొంటారని ఆదినారాయణ ఆకాంక్షించారు.

రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు

మద్దికెర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో వైభవంగా రంగనాథ స్వామి పూజలు నిర్వహించారు. కార్తికమాసంలో భాగంగా రంగనాథ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు రంగనాథ స్వామి ఆధ్వర్యంలో మూలవిరాట్ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ రవికుమార్ ఉన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఆలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఒకేషనల్ ఎడ్యుకేషనల్‌లో భాగంగా జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో ఆలూరు మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్‌విద్యార్థులు జిల్లా స్థాయి ఐటీ, ట్రేడ్ స్కిల్ కాంపిటీషన్‌లో ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ వీరేష్, వైస్ ప్రిన్సిపాల్ మంజుల శనివారం తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి స్కిల్ కాంపిటీషన్‌కి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన పదో తరగతి విద్యార్థి మహమ్మద్‌అజమ్, ఇంటర్ విద్యార్థినీలు చంద్రకళ, గౌతమిలను, వృత్తి విద్యా అధ్యాపకులు ప్రకాష్, శివలను అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

తుగ్గలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యాధులతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం అని టీడీపీ తెలుగు రైతు అధ్యక్షుడు బాలన్న, విద్యాకమిటి చైర్మన్ మిద్దె రవికుమార్, యువ నాయకులు మిద్దె వెంకటేశ్ యాదవ్ అన్నారు.రాష్ట్రంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారనీ అన్నారు.

హాస్టళ్లను సద్వినియోగం చేసుకోండి

పత్తికొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వసల గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసే సీజనల్ హాస్టళ్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రమేష్ అన్నారు. శనివారం పత్తికొండ మండలంలోని నలకదొడ్డి, దేవనబండ, కోతిరాళ్ళ, దూదేకొండ సిజనల్ హాష్టళ్ళను ఆయన ప్రారంభించారు. వలసలు వెళ్లే తల్లిదండ్రులు తమ పిల్లలను ఈసీజనల్ హాస్టల్లో వదిలి వెళ్లాని సూచించారు. మండల కోఆర్డినేటర్, రఘు, శేఖర్, నాగేష్, పరమేష్,రంగస్వామి, గోవిందు, మధ్యాహ్నమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

దేవనకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెర్నేకల్ బీసీ హస్టల్ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. తెర్నేకల్ వైద్యాధికారి ఆరుణజ్యోతి హస్టల్‌లోని 398 మంది విద్యార్థులకు పరీక్షలు జరిపారు. జలుబు, గజ్జి, తామర, దురద, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, దగ్గు తదితర పరీక్షలు విద్యార్థులకు చేశారు. విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలని తడి బట్టలు వేసుకొవద్దని, చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని సుచించారు. వార్డెన్ కోటేశ్వరయ్య, వైద్యసిబ్బంది రంగస్వామి, నాగవేణి,తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌లో పెద్దహోతూరు వాసి హత్య

ఆస్పరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెద్దహోతూరు గ్రామానికి చెందిన నెట్టేకల్(50) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురైనట్లు ఆస్పరి సీఐ ఎ.గంగాధర్ శనివారం విలేకరులకు తెలిపారు. హైదరాబాద్‌కు బతుకుదెరువు కోసం వెళ్లిన నెట్టేకల్‌ను ఆస్పరి మండలం అలిగేర గ్రామానికి చెందిన బంగిరాజుతో పాటు అతని అనుచరులు ఐదుగురు నెట్టేకల్‌పై దాడి చేసి హత్య చేసినట్లు సీఐ వివరించార. బాధితులు హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ పోలీస్‌స్టే కేసు నమోదైనట్లు సీఐ తెలిపారు.

ఈ రహదారిలో నడిచేది ఎలా?



కమ్మరచేడు గ్రామంలో రోడ్డుపై నిలిచిన ఉన్న మురుగు

ఆలూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కమ్మరచేడు గ్రామంలో కురుకుందకు వెళ్లే ప్రధాన రహదారిపై అడుగుకో పెద్ద గుంతల్లో మురుగునీరు వల్ల రహదారులు చిత్తడిగా మారింది. నిత్యం రహదారిపై ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల నుంచి ఎల్లార్తి షేక్షావలి-షాషావలి దర్గాకు కమ్మరచేడు మీదుగా భక్తులు, ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా రహదారిలో డ్రైనేజీ కాలువలు లేక నీరు రహదారిపై నిల్వ ఉండడంతో చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎస్టీయూ మండల కమిటీ ఎన్నిక



మండల కమిటీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తుగ్గలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఎస్టీయూ రాష్ట్ర నాయకులు వై.శ్రీనివాసులు తెలిపారు. శనివారం రాతన ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం సమావేశం నిర్వహించి నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో గౌరవాధ్యక్షులుగా గోవర్ధన్ రెడ్డి, అధ్యక్ష ఉపాధ్యక్షులుగా సంజీవ, మురళికృష్ణ, ప్రధాన కార్యదర్శి వీరన్న, కార్యదర్శులుగా రాజశేఖర్, సుధాకర్, ఆర్థిక కార్యదర్శిగా గోపాల్‌తో పాటు మిగిలిన కమిటి సభ్యులను కూడా ఎన్నుకున్నారు. 2010 కంటే ముందు డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు టెట్ పరీక్షలు నిర్వహించడం అన్యాయం అని, వెంటనే ఆ పరీక్షను రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే చెల్లించాలనీ, పీఆర్‌సీ కమిటి వేసి వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు నాగేంద్రప్ప, చంద్రశేఖర్, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నందవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నందవరం హైస్కూల్‌లో నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హైచ్‌ఎం రామకృష్ణం రాజు శనివారం తెలిపారు. హ్యాండ్ బాల్‌లో యూ-17 సీలో గీతాంజలి, యూ-14 ఎంలో ఎం. శివాజీ, హకీ యూ-17లో అమృత,పవర్ ర్ లిఫ్టింగ్ 53కేజీ విభాగంలో యూ-17లో జగన్ ఎంపికైనట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు లతీఫ్, ఉమాపతి, సూరజ్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముగతి ఆరన్న, బసవ రాజు, విరుపాక్షి, ఎల్లప్ప, ప్రమీలా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉరుకుంద విద్యార్థులు

కౌతాళం: మండలంలోని ఉరుకుంద ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల అండర్-14, 17 సాఫ్ట్ బాల్ పోటీలు నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి చదువుతున్న కావలి సూరి అండర్ 17 విభాగంలో అండర్ 14 విభాగంలో తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎరిగేరి శిరీషలు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పీడీ వరలక్ష్మి, పీఈటీ రమేష్‌లను, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందారు.

పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి


విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గోనెగండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి, 12వ పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు డిమాండ్ చేశారు. శనివారం గోనెగండ్ల మండలంలోని ఎర్రబాడు, పిల్లిగుండ్ల, ఐరన్‌బండ, గంజహళ్లి, బైలుప్పల, గ్రామాలలోని పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎర్రబాడు పాఠశాలలో విద్యార్థులకు డీటీఎఫ్ సంఘం తరుపున పుస్తకాలు, పెన్సిల్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కిషోర్, గంగాధర్, ఖాజబంద పాల్గొన్నారు.

జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న పంపన్నగౌడ్

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలో 10న జరిగే రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ కోరారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం నష్టపోయిన రైతులకు రూ.50వేల పరిహారం అందజేస్తామని చెప్పి ఇప్పటి వరకు అందజేయలేదన్నారు. అలాగే పత్తిరైతులను ఆదుకోవాలని 18,19న ఆదోనిలో జరిగే రాష్ట్ర స్థాయి పత్తిరైతు సమ్మేళనానికి రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కేసీ జబ్బార్, అంజినయ్య, వెంకటేష్, బాస్కర్‌యాదవ్, రంగన్న, రాజీవ్ పాల్గొన్నారు.

తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించాలి


జీపు జాతాను ప్రారంభిస్తున్న సీపీఎం నాయకుడు రాధాకృష్ణ

ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని గోనెగండ్ల బైపాస్ రోడ్డులో ఎమ్మిగనూరు మండలంలో తాగునీటి సమస్యన పరిస్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో జీపు జాతాను ఆయన ప్రారంభించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలంలోని అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని ఆ సమస్యలను వెంటనే పరిష్కారించాలన్నారు. ఎమ్మిగనూరు పట్టణాన్ని దృష్టిలో ఉంచుకొని గుడికల్ చెరువులో పూడికను తీయాలన్నారు. ఈ సమస్యలపై మండలంలో జీపు జాతాను గ్రామ గ్రామాన నిర్వహిస్తు ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గురుశేఖర్, గోవిందు, హనుమంతు, లక్ష్మినరసయ్య, రాముడు, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో నెలకొన్న తాగు, సాగునీటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ. గోవిందు, గురుశేఖర్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలతో ఎమ్మిగనూరు నియోజకవర్గంలో రెండు రోజుల పాటు జీపు జాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో బాగంగా శనివారం గోనెగండ్ల మండలంలోని గోనెగండ్ల, హెచ్ కైరవాడి, కులుమాల, చిన్నమరీడు, అలువాల గ్రామాలలో పర్యటించారు. 10న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహిస్తున్నామని ఆ కార్యక్రమాన్ని ప్రతి రైతు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, నబిరసూల్, మునెప్ప, పాల్గొన్నారు.

విరాళం అందజేత


నగదును అందజేస్తున్న దాతలు

కౌతాళం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి వారికి ఓ భక్తుడు శనివారం దేవాలయంలో చేపడుతున్న జీర్ణోద్ధారణ పనులకు రూ.96వేలు నగదును విరాళంగా అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్,ఈఓ వాణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ దేవాలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు కర్ణాటక రాష్ట్రం మాన్వి తాలుకా పోతనాల్ గ్రామ వాస్తవ్యులు సచిన్ కుటుంబ సభ్యులు నగదును అందజేసినట్లు తెలిపారు.

మద్యం సేవించి వాహనాలను నడపొద్దు


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ ఎర్రన్న


ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలను నడపవద్దని ట్రాఫిక్ ఎస్ఐ ఎర్రన్న అన్నారు. శనివారం పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో ద్విచక్ర, ఆటో డ్రైవర్లుకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకోవద్దన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేయటం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వంటివి చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది రామకృష్ణ, నరసింహులు, కర్ణలు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను సాధిద్దాం

ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భూమికోసం, భుక్తికోసం పేదప్రజల విముక్తి కోసం అనేక ఉద్యమాలు చేసి అమరులైన చంద్రపుల్లారెడ్డి, నీలం రామచంద్రయ్య, రామన్న గౌడ్‌తో పాటు ఎంతో మంది అమరుల ఆశయాలను సాదిద్దామని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొలిమి ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఏసేపు, ఐఎఫ్‌టీయు రాష్ట్ర కార్యదర్శి నరసన్న, జిల్లా కార్యదర్శి అనీఫ్‌లు పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ ఎంఎల్ చంద్రపుల్లారెడ్డి పార్టీ ఆధ్వర్యంలో గోనేగండ్ల రోడ్డులో అమరులు రామన్న గౌడ్ స్థూపం దగ్గర అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

తీరనున్న ప్రజల కల


పూర్తికావస్తున్న ట్యాంక్ పనులు


అండర్ గ్రౌండ్ తాగునీటి పైప్‌లైన్ పనులు చేస్తున్న దృశ్యం

- వేగంగా సాగుతున్న ఎంవీఎస్ పనులు
- రూ. 19.50 కోట్లతో 14 గ్రామాలకు తాగునీటి సౌకర్యం
- కూటమి ప్రభుత్వంలో ఊపందుకున్న పనులు

గోనెగండ్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన ఎంవీఎస్ స్కీం పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తోంది. వారం రోజుల నుంచి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి 14 గ్రామాలకు అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎంవీఎస్ స్కీం కింద మండలంలోని 11 గ్రామాలకు తాగునీరు అందించేందుకు రూ.13.50 కోట్ల నిధులతో పనులు ప్రారంభించారు. అయితే అప్పటి సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ అధికారంలోకి రావడంతో ఎంవీఎస్ స్కీం పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. 2025లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 11 కాకుండా 14 గ్రామాలకు రూ. 19.50 కోట్లను విడుదల చేశారు. పనులు కూడా పూర్తి దశలో ఉన్నాయి.

తాగునీటి సమస్య తీరనుంది..



మండలంలోని 11 గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం మల్టీవిలేజస్‌స్కీం కింద రూ.13.50 కోట్లు విడుదల చేసింది. 2017 ఏప్రిల్‌లో నాయకులు భూమి పూజ చేశారు. ఈ పథకం కింద హెచ్ కైరవాడి, గాజులదిన్నె, పుట్టపాశం, పెద్దనేలటూరు, ఎర్రబాడు, కులుమాల గ్రామాల్లో ఓహెచ్ ట్యాంక్‌లు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారులోకి రాగానే పథకాన్ని పట్టించుకోలేదు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 13.50 కోట్ల నుంచి రూ. 19.50కోట్లు నిధులు కేటాయించి 11 గ్రామాలకు అదనంగా మరో 3 గ్రామాలను చేర్చి 14 గ్రామాలకు నీరు అందించేందుకు నిర్ణయించారు.

శరవేగంగా పనులు: తాగునీటికి సంబంధించిన ఆరు ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు పూర్తయ్యాయి. ఈ పనులు గత 2017లో టీడీపీ హయంలో విడుదలైన రూ. 13.50 కోట్ల నుంచి ఆరుగ్రామాల్లో ఆరు ఓహెచ్ఆర్ ట్యాంకర్లను నిర్మించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిధులతో హెడ్ వర్కుపనులు, ఓహెచ్‌బీఆర్‌పనులు ఇన్‌టెక్‌వెల్, 5 ఎంఎల్‌డీ ఫిల్టర్, ఆర్ఎస్ఎఫ్ ఫిల్టర్, 44 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. హెచ్‌కైరవాడి, కులుమాల, ఎర్రబాడు, గాజులదిన్నె, పుట్టపాశం గ్రామాల ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు పూర్తయ్యాయి.

పథకం లక్ష్యం: ఎంవీఎస్ స్కీం ప్రభుత్వం గోనెగండ్ల మండలంలోని గాజులదిన్నె హెచ్‌కైరవాడి, ఎర్రబాడు, పుట్టపాశం, కులుమాల, పెద్దమరివీడు, వీరంపల్లి, తిప్పనూరు. నెరుడుప్పల, పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె గ్రామాలకు ఎమ్మిగనూరు మండలంలోని ఎర్రకోట, రాళ్లదొడ్డి, కడిమెట్ల గ్రామాలు కలుపుకొని 14 గ్రామాలకు తాగునీరు అందించేందుకు పథకం ఏర్పాటు చేశారు.

జీడీపీ దగ్గర స్థలం కేటాయింపు: గాజులదిన్నె ప్రాజెక్టు సమీపంలో ఎంవీఎస్ స్కీంకు అప్పటి జనవనరుల శాఖ 75 సెంట్ల స్థలాన్ని కేటాయించింది. ఈ ప్రదేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఓహెచ్ఆర్ ట్యాంక్, బ్యాలెన్స్ రిజర్వాయర్, ర్యాపిడ్‌శ్యాండ్ ఫిల్టర్స్‌ను నిర్మించి గాజులదిన్నె ప్రాజెక్టులోని నీటిని బ్యాలెన్స్ రిజర్వాయర్‌లో నిలువచేసి గ్రామాలకు సరఫరా చేయాలన్నది పథకం లక్ష్యం. అలాగే వాచ్‌మెన్‌గదులను నిర్మిచారు.

పనులు త్వరగా పూర్తి చేస్తాం



ఎంవీఎస్ స్కీం కింద ప్రారంభమైన పనులు రూ. 13.50 కోట్లనుంచి రూ. 19.50 కోట్లకు పెరిగాయి. ఇప్పటికి దాదాపు సగం పనులు పూర్తయ్యాయి. రెండు, మూడు నెలలో పనులు పూర్తి చేసి 14 గ్రామాలకు తాగునీరు అందిస్తాం.

● శ్రీనివాసరెడ్డి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, గోనెగండ్ల

ఉర్దూ పాఠశాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే


విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ ఉర్దూ ఉన్నతపాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి మంత్రి నారా లోకేశ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం నాడు నేడు పేరుతో రంగులు కొట్టి వదిలేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో విద్యామంత్రి నారా లోకేశ్ విద్యారంగాన్ని ప్రక్షాళన చేస్తున్నారన్నారు. ఉర్దూ పాఠశాల విద్యార్థినులు కూడా బాగా చదువుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ముగ్గురు విద్యార్థులు మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. అంతకు ముందు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులతో సమావేశమై సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంఈవో మధుసూదన్ రాజు, హెచ్‌ఎం కోటప్ప, నిస్సార్ హమ్మద్, టీడీపీ పట్టణ అధ్యక్షులు మచాని మహేష్, శాబీర్ అహ్మద్, తురేగల్ నజీర్, నవాజ్, గట్టు అల్తాఫ్, జహంగీర్, గుల్లా సలాం, కౌన్సిలర్ అమాన్, అబ్దుల్లా, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా ఆది నగేష్



ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సూపరిటెండెంట్‌గా డా.ఆది నగేష్‌ను నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శనివారం డా ఆది నాగేష్ వైద్యశాలలో సూపరండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తు బదిలీఅయిన డా.మాధవి స్థానంలో ఇన్‌చార్జీగా డా సుధా అయ్యాంగర్‌ను నియమించారు. గత నెల రోజుల క్రితం ఆదోని నుంచి బదిలీపై వచ్చిన డా ఆదినగేష్‌ను ప్రభుత్వం పూర్తి స్థాయి సూపరిటెండెంట్‌గా నియమించింది. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని విధాల వైద్యసేవలు అందేలా చూస్తామన్నారు.

● **అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం:** ప్రభుత్వ వైద్యశాలలో శనివారం అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని నిర్వహించారు. రేడీయాలజీ పితామహుడు విలియమ్ కాన్రాడ్ రామ్జెన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సూపరండెంట్ డా ఆది నగేష్, రేడియాలజీ ఇన్‌చార్జీ డా చంద్రశేఖర్, డా సుధా, టెక్నీషియన్స్ విజయ్, ప్రశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి

ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్‌నుంచి మినహాయించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్థన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో నాయకులు బాబయ్య అధ్యక్షతన ఎమ్మిగనూరు, మంత్రాలయం శాఖల సమావేశం నిర్వహించారు. జనార్థన్ మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ టీచర్లు టెట్ పాస్ కావాలని సూచిస్తూ రాష్ట్ర విద్యాశాక విడుదల చేసిన జీఓ నెంబర్ 36ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం కేంద్రం పై ఒత్తిడి తీసుకొచ్చి టెట్‌ను రద్దు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు నాగరాజు, బసవరాజు, ప్రసన్న రాజు, ఎల్లప్ప, నాగరాజు, తిమ్మరాజు, రామచంద్ర, లక్ష్మన్న, వెంకటరాముడు, షరీఫ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థి సమస్యలపై నిరంతర పోరాటం

ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థి సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోందని జిల్లా కార్యదర్శి రంగప్ప అన్నారు. శనివారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా స్వర్ణోత్సవాల మహాసభల కరపత్రాలను ఎంఈఓ ఆంజనేయులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగప్ప మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఎస్ఎఫ్ఐ 50వ మహాసభలు డిసెంబర్ 4,5 తేదిలలో ఆలూరు పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల జీవితాల్లో మార్పు కోసం, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తోందన్నారు. ఈ మహాసభల్లో భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తారన్నారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు రాము, వీరేంద్ర, రాజులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

కోసిగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధూప దీప నైవేద్యాల కోసం గౌరవ వేతనం ప్రకటించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కురువ సంఘం నాయకులు వీరేష్, తాయన్న, ముక్కన్న పేర్కొన్నారు. శనివారం కోసిగిలో వారు మాట్లాడుతూ బీరప్ప దేవాలయంలో సేవలు చేస్తున్న పూజారుల కోసం గౌరవ వేతనం ప్రకటించడం హర్షణీయమని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బీరప్ప డ్రోల్లు కళాకారులకు కూడా వయస్సుతో సంబంధం లేకుండా పింఛన్లు కల్పించాలని కోరారు.

అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ


అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కోసిగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపాపురం గ్రామంలో శనివారం డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి ఎమ్మార్పీఎస్ నాయకులు భూమి పూజ చేశారు. గ్రామ సర్పంచ్ హరూన్, ఎమ్మార్పీఎస్ మంత్రాలయం ఇన్‌చార్జి బండారు హనుమంతు, జిల్లా ఉపాధ్యక్షులు దుర్గప్ప ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సామేలు, తాలుకా నాయకులు దేవన్న, సోల్మాన్, జయన్న ప్రకాష్, నరసింహులు, పురుషోత్తం పాల్గొన్నారు.

ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాబురావు


బాబురావు ను సన్మానిస్తున్న చైర్మన్ బుచ్చి రాంప్రసాద్

మంత్రాలయం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడుబూరు మండలం గంగులపాడు గ్రామానికి చెందిన సీనియర్ అడ్వకేట్ బాబురావు ఏపీ బ్రహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. శనివారం విజయవాడలోని గొల్లపూడి సమావేశ మందిరంలో బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ఆధ్వర్యంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయనకు శాలువా, పూలమాల, నియామక పత్రం ఇచ్చి సత్కరించారు. బ్రహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, నారాలోకేశ్, పవన్‌కళ్యాణ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మంచాల సింగిల్‌విండో అధ్యక్షులు రామకృష్ణరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి'


జెండా ఎగురవేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యునియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం

ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ ఓపన్ థియేటర్‌లో మున్సిపల్ కార్మికులు మూడో జిల్లా మహాసభలు నాయకులు జయ నాగరాజు, రాముడు అధ్యక్షతన నిర్వహించారు. నాయకు లు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికవర్గం 30ఏళ్ల సేవలు చేసినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించడం లేదన్నారు. కార్మికులంతా సంఘటింగా ఉండి సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలన్నారు.

● **నూతన కార్యవర్గం ఎన్నిక:** కర్నూలు జిల్లా మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యునియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఇస్మాయిల్, ఉపాధ్యక్షులుగా సోమన్న, నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కైలాష్, సహాయ కార్యదర్శిగా ఓబులేషు,శాంతన్న, కోశాధికారిగా మనోహార్‌లతో పాటు మరో 11మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. మహాసభల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, మండల సీఐటీయూ అధ్యక్షులు గోవిందు, నాయకులు రమేష్, సురేష్, మున్సిపల్ నాయకులు ఖాజా, మునీంద్ర, గోర్పాషా, రంగస్వామి, సాల్మాన్, లక్ష్మన్న పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలను కాపాడుకోవాలి


కోటి సంతకాలు సేకరిస్తున్న సీవీ విశ్వనాథరెడ్డి, నాయకులు

మంత్రాలయం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవాలని వైసీపీ జిల్లా కార్యదర్శి సీవీ విశ్వనాథరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వగరూరు గ్రామంలో మెడికల్ కళాశాలల విధానాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణను సర్పంచు లింగారెడ్డి, ఎంపీటీసీ చిన్నన్న, వైస్ సర్పంచు చిన్న హుస్సేని ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో నాయకులు మహాదేవ,తిక్కన్న, లక్ష్మన్న, వీరనాగుడు, నాగిరెడ్డి, ఏసేబు, వినోదు, లాజరు,మహంబూబ్ బాషా, ఖాజా, రాముడు, దస్తగిరి, వెంకటరాముడు పాల్గొన్నారు.

వైసీపీని బలోపేతం చేయడమే లక్ష్యం


కేఆర్ మురహరి రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైసీపీని బలోపేతం చేయడమే లక్ష్యమని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన కేఆర్ మురహరి రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో ఆయన స్వగృహంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ,నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నజీర్ అహ్మద్, వైసీపీ పట్టణ ఉపాధ్యక్షులు బజారు రెడ్డి, మండల యువజన నాయకులు బి బసిరెడ్డి, 15వ వార్డు ఇన్‌చార్జీ సయ్యద్ ఫయాజ్‌తో పాటు పలువురు నాయకులు కేఆర్ మురహరి రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా అధ్యక్షులు షరీఫ్, రాజ్ కుమార్, జస్వంత్, నజీర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు భక్త కనకదాసు: ఎమ్మెల్యే బీవీ


భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి



కనకదాసుకు ఘన నివాళి

ఎమ్మిగనూరు/ మంత్రాలయం/ కోసిగి/ నందవరం/ పెద్దకడబూరు/ కౌతాళం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో జన్మించిన భక్త కనకదాసు గొప్ప ఆదర్శ ప్రాయుడని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. భక్త కనకదాసు జయంతిని పురస్కరించుకొని శనివారం ఎమ్మెల్యే ఇంటిదగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళిఅర్పించారు.

● కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలిః ఎమ్మిగనూరు పట్టణంలో భక్త కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కురువ సంఘం నాయకులు ఎర్రకోట హంపయ్య, వీరనాగప్ప, మద్దిలేటి, కేటీ ఉరుకుందు, బోడబండ నరసింహులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పట్టణంలోని కురువ కమ్యూనిటి హాల్‌లో భక్త కనకదాసు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● మంత్రాలయం, పెద్దకడబూరు, కోసిగి, నందవరం, గోనెగండ్ల మండలాల్లో భక్త కనకదాసు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కోసిగిలోని గీతాశ్రమంలో కురువ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.


కౌతాళంలో కనకదాసు విగ్రహం వద్ద పూజలు చేస్తున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప


గొరవయ్య అలంకరణలో సింగిల్‌విండో అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి


కోసిగిలో భక్త కనకదాసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కురువలు